

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 04 మే 2021 సంపుటి : 02 సంచిక : 293 పేజీలు : 4 వెల : రూ

## ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్‌తో యువకుల వాగ్వాదం

విజయవాడ: దారి ఇవ్వలేదని ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్‌తో ఆరుగురు యువకులు వాగ్వాదానికి దిగారు. విజయవాడ నగర శివారు ఎనికేపాడు వద్ద అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎంతసేపు హారన్ కొట్టినా ట్రావెల్స్ డ్రైవర్ దారి ఇవ్వక పోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణ అనంతరం బస్సును ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్ ప్లాజా వరకూ ఆరుగురు యువకులు వెంబడించారు. టోల్ ప్లాజా వద్ద బస్సుకి ఎదురుగా వాహనాలు పెట్టి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. సదరు యువకులను అదుపులోకి తీసుకున్న ఆత్కూరు పోలీసులు పటమట స్టేషన్‌కి అప్పగించారు.

# ఎపిలో కరోనా నియంత్రణకు చర్యలు



**పగటిపూట కర్ఫ్యూకు సిఎం జగన్ నిర్ణయం**

**ఉదయం 6నుంచి 12 గంటల వరకు మాత్రమే సడలింపు**

**5వ తేదీనుంచి ఆంక్షలు అమలుకు ఆదేశాలు**



అమరావతి,మే3 : ఎపిలో పెరుగుతున్న కరోనా కేసులతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. వివిధ రాష్ట్రాలు దీనిపై సిరయస్‌గా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో కోవిడ్ నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి పాక్షిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మాత్రమే దుకాణాలకు అనుమతి ఇచ్చింది. అత్యవసర సేవలకు కర్ఫ్యూ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు 144 సెక్షన్ అమలు కానుంది. రెండు వారాల పాటు కర్ఫ్యూ కొనసాగనుంది. కోవిడ్‌పై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య తగ్గించడం, బెడ్‌ల కొరత నివారించేందుకు అవసరమైన చర్యలపై సీఎం చర్చించినట్టు తెలుస్తోంది. చర్చల అనంతరం సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు బుధవారం నుంచి పగటి పూట కూడా కర్ఫ్యూ విధించాలని నిర్ణయించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే షాపులకు అనుమతి ఇవ్వనున్నారు. 12 గంటల తర్వాత అత్యవసర సేవలు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి. ఆ సమయంలో 144వ సెక్షన్ అమలులో ఉండనుంది. ఈ ఆంక్షలను రెండు వారాల పాటు అమలు చేయనున్నారు. ఏపీలో ఇప్పటికే రాత్రి పూట కర్ఫ్యూ అమలులో ఉన్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీఎం జగన్ వద్ద కోవిడ్‌పై సుదీర్ఘంగా సమీక్షించామని ఏపీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసుల సంఖ్య తగ్గించడం, బెడ్‌ల కొరత నివారించేందుకు అవసరమైన చర్యలపై సీఎంతో చర్చించినట్టు తెలిపారు.

# ఏబీకి హైకోర్టులో ఊరట


విజయవాడ, మే 3, (న్యూస్ పల్స్)ఏపీ సీనియర్ ఐపీఎస్, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుకు ఊరట లభించింది.ఏపీ హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రక్షణ పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో ఏసీబీ కేసు నమోదు చేసింది.. తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంకటేశ్వరరావుకు ముందస్తు బెయిల్ ఇచ్చింది.1989 ఏపీ ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన ఏబీ వెంకటేశ్వరరావు గతంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో చంద్రబాబుకు అనుకూలంగా పని చేస్తున్నారంటూ వెంకటేశ్వరరావుపై వైసీపీ ఫిర్యాదు చేసింది. దీంతో గత ఎన్నికలకు ముందు ఆయన్ను ఇంటెలిజన్స్ చీఫ్ పదవి నుంచి ఎన్నికల సంఘం తప్పించింది. ఈసీ నిర్ణయంపై అప్పట్లో చంద్రబాబు తీవ్ర విమర్శలు కూడా గుప్పించారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట వెంకటేశ్వరరావును బదిలీ చేసిన ప్రభుత్వం.. పోస్టింగ్ ఇవ్వకుండా కొన్నాళ్లు వెయిటింగ్‌లో పెట్టింది.ఆ తర్వాత వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు గానూ ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వెంకటేశ్వరరావు పని చేసిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయెల్ సంస్థ నుంచి నిఘా పరికరాల కొనుగోలు చేసినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ సంస్థ ఆర్టీ ఇన్ ప్లేటబుల్స్‌తో కుమ్మక్కై ఆయన కొడుకు చేతన్ సాయికృష్ణకు చెందిన ఆకాశం అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థకు కాంట్రాక్టు ఇప్పించుకున్నారని జీవోలో పేర్కొంది. విదేశీ సంస్థతో నిఘా సమాచారం పంచుకోవడం ద్వారా జాతీయ భద్రతకు ముప్పు కలిగించారని తెలిపింది. నాణ్యత లేని నిఘా పరికరాల కొనుగోలు ద్వారా రాష్ట్ర భద్రతకు ముప్పు కలిగించారని పేర్కొంది. కావాలనే టెండర్ల సాంకేతిక కమిటీలో నిపుణులకు స్థానం కల్పించలేదని వివరించింది. సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్, మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావుపై రాష్ట్రప్రభుత్వం వేసిన ఎంక్వైరీ కమిషన్ విచారణ ముగిసింది. విచారణ కమిషనర్ సిసోడియా ముందు ఆయన తన వాదనను రాతపూర్వకంగా సమర్పించారు.

# సీఎం జగన్‌ను కలిసిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుపతి ఎంపీ డా.గురుమూర్తి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీ సాధించిన నేపథ్యంలో మంత్రులను, ఎమ్మెల్యేలను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. గురుమూర్తి వెంట డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, సంజీవయ్య తదితరులు ఉన్నారు.సీఎం జగన్ సంక్షేమ పాలనకు పట్టంగట్టి తామంతా ఆయన వెంటే ఉన్నామని తిరుపతి ఎన్నికల ఫలితాల సాక్షిగా ప్రజలు మరోసారి నిరూపించారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఎం.గురుమూర్తిని 2,71,592 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించి వరుసగా మూడోసారి పార్టీకి ఘన విజయం చేకూర్చారు. కరోనా పరిస్థితి వల్ల పోలింగ్ శాతం తగ్గిపోయినా వైఎస్సార్‌సీపీ ఓట్ల శాతం మాత్రం గతం కంటే పెరగడం గమనార్హం.

# ఏపీలో అత్యంత ప్రమాదకర కరోనా వైరస్ వ్యాపించింది: చంద్రబాబు



అమరావతి: పార్టీ ముఖ్య నేతలతో నేడు టీడీపీ అధినేత చంద్రబాబు సమావేశమయ్యారు. అత్యంత ప్రమాదకర కరోనా వైరస్ ఎన్ 440కె ఏపీలో వ్యాపించిందన్నారు. తొలిసారిగా దీనిని సీసీఎంబీ శాస్త్రవేత్తలు కర్నూలులో గుర్తించారన్నారు. ఇతర వైరస్‌ల కన్నా 10 రెట్లు ప్రభావం ఎక్కువ చూపుతుందని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా లాక్‌డౌన్‌కు చర్యలు చేపట్టాలని తెలుగుదేశం డిమాండ్ చేసింది. ఇప్పటికే 14 రోజుల పాటు ఒరిస్సా లాక్‌డౌన్‌ను ప్రకటించిందని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యాక్సినేషన్ కోసం పలు రా(ష్ట్రాలు పెద్ద ఎత్తున ఆర్డర్లు పెట్టాయన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. రంగుల కోసం రూ.3000 కోట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. గోరంతల్ని కొండంతలుగా చేసి ప్రచారం నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వంపై నిందలు వేయడానికి సాక్షిలో ఫుల్ పేజీ యాడ్స్ కోసం వందలకోట్లు దుబారా చేసిందన్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. వైద్య సిబ్బంది కొరతను తీర్చడానికి నియామకాలు చేపట్టాలన్నారు. బెడ్లు–ఆక్సిజన్ సరఫరా పెంచాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

# జగన్‌కు అధికారంలో ఉండే అర్హత లేదు: పరిటాల సునీత



అనంతపురం: హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి ఘటనపై మాజీ మంత్రి పరిటాల సునీత స్పందించారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ అందక రోగుల మృతి బాధాకరమని అన్నారు. రోగులకు ఆక్సిజన్ అందించలేని జగన్మోహన్ రెడ్డికి అధికారంలో ఉండే అర్హత లేదని తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో హిందూపురం ఆస్పత్రిలో 12 మంది మృతిచెందారని... మృతుల కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్సిజన్ సకాలంలో అందక ప్రజల ప్రాణాలు పోతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని చోద్యం చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అసమర్థతకు, వైసీపీ ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి మరెంతమంది బలికావాలని ప్రశ్నించారు. అనంతపురం సర్వజన ఆస్పత్రి, కర్నూలు కేఎస్ కేర్ ఆస్పత్రుల్లో ప్రాణవాయువు అందక ఇప్పటికే 26మందికి పైగా చనిపోయారని తెలిపారు. కరోనా సోకిందనే బాధకంటే ఆక్సిజన్ దొరుకుతుందా లేదా అనే ఆందోళన రోగులను మరింత కుంగతీస్తోందని చెప్పారు. ఎంతసేపూ ప్రత్యర్థులను ఎలా ఇబ్బంది పెట్టాలని, మోసపూరిత మాటలతో రాజకీయ పబ్బం ఎలా గడుపుకోవాలని అనే వాటిపైనే జగన్మోహన్ రెడ్డి దృష్టి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా మొదటి దశ ఉధృతి సమయంలోనే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెంటిలేటర్లను అందజేస్తే వాటిని ఇంతవరకూ ఆస్పత్రిలో అమర్చనే లేదన్నారు. తమ నిర్లక్ష్యానికి అమాయక ప్రజలను బలిచేస్తారా? అని నిలదీశారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం వీడాలని....తాడేపల్లి ప్యాలెస్ దాటి ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించాలన్నారు. ఆక్సిజన్, బెడ్లు, రెమ్ డెసివిర్ కొరతపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని పరిటాల సునీత డిమాండ్ చేశారు.

# మాజీ ఎంపీ సబ్బం హరి ఇక లేరు



విశాఖ: మాజీ ఎంపీ సబ్బంహరి ఇక లేరు. కరోనాతో బాధపడుతున్న ఆయన నేడు పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఏప్రిల్ 15న సబ్బం హరికి కరోనా సోకడంతో తొలుత ఆయన హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం సబ్బంహరి పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సను అందిస్తున్నారు. నేటి ఉదయం నుంచే ఆయన పరిస్థితి మరింత విషమంగా మారింది. దీంతో ఆయన కన్నుమూసినట్టు వైద్యులు వెల్లడించారు.సబ్బం హరి జూన్ 1, 1952న బంగారునాయుడు, అచ్చియమ్మ దంపతులకు విశాఖపట్టణంలోని చిట్టివలసలో జన్మించారు. ఆరుగురు సంతానంలో చివరివాడు. సొంతూరులోని తన పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీ ఏవీఎన్ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ ఫైనలియర్ చదువుతూనే అనేక వ్యాపారాలు చేశారు. నష్టం రావడంతో అన్ని బిజినెస్‌లకు గుడ్‌బై చెప్పారు. 1955 విశాఖ మేయర్ ఎన్నికల్లో పోటి చేశారు. మేయర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. అవినీతి ఆరోపణలు లేకుండా మేయర్‌గా పరిపాలన కొనసాగించారు. పారిశుద్ధ్యాన్ని ప్రైవేటీకరణ చేసిన తొలి నగరంగా విశాఖను సబ్బం హరి మలిచారు. విశాఖ కాంగ్రెస్ కమిటీలో కార్యదర్శిగా.. అనంతరం నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా సబ్బం నియామకమయ్యారు. 1970 అక్టోబర్ 15న లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నారు. సబ్బంకు అవని, అర్చన అనే ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారుడు వెంకట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. 15వ లోక్‌సభకు అనకాపల్లి ఎంపీగా కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు.

# ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టి వ్యాక్సిన్ ఇస్తారా: పట్టాభిరామ్

అమరావతి: వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వ్యాక్సినేషన్ చేపట్టాలంటే వైసీపీ ప్రభుత్వం.. 6 వేల కోట్ల రూపాయల వరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుందని చెప్పారు. వ్యాక్సిన్ల కొనుగోలు కోసం ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టడానికి సీఎం సిద్ధమయ్యారని మండిపడ్డారు.విద్యుత్ శాఖలోని డిస్కంల పరిధిలోని ఉద్యోగుల ఒక రోజు జీతం.. కోత పెడుతున్నట్టు ప్రభుత్వం ఏప్రిల్ 27న సర్క్యులర్ ఇచ్చిందని తెలిపారు. ఉద్యోగుల జీతాలకు కోతపెట్టి వ్యాక్సినేషన్ ఇస్తామని చెప్పడమేంటి? అని పట్టాభిరామ్ సీఎం జగన్‌ని నిలదీశారు. ఏపీ సీపీడీసీఎల్ సీఎమ్‌డీ, ఛైర్మన్ ఇచ్చిన సర్క్యులర్‌పై ఈ ముఖ్యమంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

# పాత్రికేయులకు ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ: భారతీయ పాత్రికేయులకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..."ఈ సమాచార యుగంలో వాస్తవమైన, సంచలనాలకు తావులేని వార్తను ప్రజలకు అందించడంలో పాత్రికేయులు పోషించాల్సిన పాత్ర మరింత కీలకం. తప్పుడు సమాచారం నుంచి సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత వారిదే. కరోనా నేపథ్యంలోనూ ప్రజలకు సరైన సమాచారాన్ని అందజేసి, వారిలో ధైర్యాన్ని నింపిన పాత్రికేయుల పాత్ర అభినందనీయం. పత్రికాస్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, ప్రజల సమస్యలను మరీ ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి విషయంలో మీడియా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్య ట్వీట్ చేశారు.



# ద్వారకాతిరుమల శేషాచల కొండపై కరోనా ఎఫెక్ట్



ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల శేషాచల కొండపై కరోనా ఎఫెక్ట్ పడింది. కరోనా భయంతో కొండపై వ్యాపారులు తమ షాపులను మూసివేశారు. షాపులు మూసి వేయడంతో శేషాచల కొండ నిర్మానుష్యంగా మారింది. మరో పక్క కరోనా భయంతో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ భారీగా తగ్గింది.

# సంపాదకీయం

మంగళవారం 04 మే 2021

## పట్టు కోల్పోని ప్రాంతీయ పార్టీలు

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాల కోసం విపక్షాలు కళ్లల్లో వత్తులు వేసుకుంటున్నాయి. దేశ రాజకీయ భవిష్యత్ ముఖచిత్రానికి ఇవి దర్పణం పట్టబోతున్నాయి. ఇప్పటికే ఎగ్జిట్ పోల్ ఫలితాలను అనేక సంస్థలు అందించాయి. అయితే గతంలో అనేక సందర్భాల్లో ఈ ఫలితాలు తారుమారైన ఉదంతాలున్నాయి. అందుకే కొంత సందేహం. పెట్టుకుంటూనే ఏమైనా జరగవచ్చునే అనుమానాలూ ఉన్నాయి. ఎగ్జిట్ ఫలితాలనే ప్రామాణికంగా తీసుకుంటే నాలుగు రాష్ట్రాలకు సంబంధించి స్పష్టత వచ్చినట్లే. అయితే ఎన్నిక మొత్తంలో అతి కీలకంగా భావించిన పశ్చిమబెంగాల్ ఎవరి పరం కాబోతోందనేదే మీమాంస. మిగిలిన రాష్ట్రాల ఫలితాలన్నీ ఒక ఎత్తు. పశ్చిమబెంగాల్ ఫలితం ఒక్కటే ఒక ఎత్తు. 2024లో బారత రాజకీయ రణరంగం ఎలా ఉండబోతోందన్న అంశాన్ని ఆ రాష్ట్రం తేల్చబోతోంది. తాజాగా దేశంలో నెలకొన్న పరిస్థితులు నైతికంగా కేంద్ర ప్రభుత్వాన్ని బలహీనపరిచాయని విపక్షాలు విశ్వసిస్తున్నాయి. తాజా ఫలితాలతో సాంకేతికంగా రాజకీయ సమరంలో కూడా బీజేపీకి ఎదురుదెబ్బ తగులుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఒకవేళ ప్రజాతీర్పులో బీజేపీ వెనకంజ వేస్తే 2024లో నవీకరణలే మారిపోవడానికి మార్గం సుగమం అవుతుంది.దేశవ్యాప్తంగా విస్తరించిన బీజేపీకి రాజకీయంగా ఇంకా పూర్తి అదుపులోకి రాని పెద్ద రాష్ట్రాలుగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ను చూడాలి. పశ్చిమబెంగాల్ లో సొంతంగానూ, తమిళనాడులో పొత్తు ద్వారానూ పాగా వేయాలని గడచిన కొన్ని సంవత్సరాలుగా బీజేపీ కసరత్తు సాగిస్తోంది. తమిళనాట ఏఐఏడీఎంకే రూపంలో జీ హుజూర్ ప్రభుత్వం ఇప్పటివరకూ కొనసాగింది. పశ్చిమబెంగాల్ మాత్రం బీజేపీ అగ్రనాయకత్వానికే మమతా బెనర్జీ సవాల్ విసురుతోంది. తన రాజకీయ విస్తరణ సమరంలో ఈ రెంటినీ చివరి కోటలుగా బీజేపీ భావిస్తోంది. అసోం, పుదుచ్చేరి, కేరళ లలో రెండు తమ ఖాతాలోనే పడతాయని ఎగ్జిట్ అంచనాలతో ఆనందంగానే ఉంది. ఇది ముందుగా వేసుకున్న అంచనా యే. ఎగ్జిట్ పోల్స్ కూడా దానినే ధ్రువపరిచాయి. కేరళ పై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. అయితే అక్కడ కనీసం పదిశాతం ఓట్లు , అయిదారు సీట్లు అయినా తెచ్చుకోగలిగితే భవిష్యత్తులో బీజేపీ బలపడటానికి అవకాశముంటుందని అంచనా. . కేరళ లో ఆనవాయితీ తప్పి మరోసారి ఎల్డీఎఫ్ గెలిచే చాన్సులున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అదే జరిగితే యూడీఎఫ్ కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెసుకు ఎదురు దెబ్బే. 2024 నాటికి జాతీయ స్తాయిలో దాని ప్రాబల్యం మరింత కుచించుకుపోయి ప్రాంతీయ పార్టీల తరహాగానే ఉంటుంది. రీజనల్ పార్టీలతో పొత్తులకు అవి పెట్టే అనేకానేక షరతులను అంగీకరించాల్సి వస్తుంది. జాతీయ ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెసు పార్టీ అనేక చోట్ల ఏదో ఒక ప్రాంతీయపార్టీ చాటున చేరక తప్పని స్థితి ఏర్పడబోతోందిఅత్యంత ప్రతిష్టాత్మకంగా , బీకర సమరం సాగింది పశ్చిమబెంగాల్ లోనే. ఎనిమిది విడతల ఎన్నికలతో తృణమూల్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రం బావించింది. ఎన్నికల కమిషన్ అమలు చేసింది. ఆ రాష్ట్రంలో తృణమూల్ కార్యకర్తల గూండాయిజం, వసూళ్లు పెరిగాయనేది వాస్తవం. వాటిని నియంత్రించి ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాలనే ఉద్దేశంతో కేంద్రం పెద్ద ఎత్తున సాయుధ బలగాలను రంగంలోకి దింపింది. కాల్పుల వరకూ సంఘటనలు దారి తీశాయి. మరోవైపు చావో రేవో తేల్చుకునేందుకు సిద్దమయ్యారు మమతా బెనర్జీ. అటు మోడీ, అమిత్ షా ల ప్రచారం, ఇటు మమత ఎదురుదాడి మొత్తం బారతదేశాన్ని ఆకర్షించింది. మిగిలిన రాష్ట్రాల ఎన్నికల గురించి ఎవరూ పెద్దగా పట్టించుకో లేదు. పశ్చిమబెంగాల్ దిక్సూచి కాబోతోందని అందరికీ తెలుసు. హోరాహోరీగా సాగిన పోరులో ఫలితం ఏమవుతుందో ఎగ్జిట్ ఫోల్స్ కూడా తేల్చి చెప్పలేకపోయాయి. పశ్చిమబెంగాల్ లో స్వాతంత్ర్య సమయంలో జాతీయ భావనల ప్రభావం ఎక్కువ. ఆర్ఎస్ఎస్ సిద్దాంతకర్తలూ అక్కడి నుంచే వచ్చారు. కమ్యూనిస్టుల అధికారంతో పశ్చిమబెంగాల్ జాతీయ వాద భావనల నుంచి సామ్యవాద జోన్ లోకి వెళ్లిపోయింది. మమతా బెనర్జీ కమ్యూనిస్టు ఏకచ్ఛత్రాధిపత్యాన్ని పటాపంచలు చేసి వామపక్షాలను నిర్వీర్యం చేసేశారు. దాంతో బీజేపీ తన సైద్దాంతిక అజెండాతో రంగ ప్రవేశం చేయడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. పశ్చిమబెంగాల్ మూలాలలో ఉన్న జాతీయతను మళ్లీ మరోసారి బీజేపీ విజయవంతంగా ప్రేరేపించగలిగింది. అందుకే అక్కడ బలమైన ఫోర్సుగా ఎదిగింది. కాంగ్రెసు, వామపక్సాల కూటమి నామమాత్రంగా మారిపోయింది. తృణమూల్ వర్సస్ బీజేపీగానే పోటీ సాగింది. మమత నెగ్గితే ఆమె కేంద్రంగా మారి విపక్షాలకు జాతీయస్థాయిలో అండ దొరుకుతుంది. బీజేపీయే ముందడుగు వేస్తే దానికి పోటీగా జాతీయ స్తాయి ప్రత్యామ్నాయం కనుమరుగు కావచ్చు.తమిళనాడులో జాతీయ పార్టీలను నిలువరించడమే కాదు, బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిన ఏఐఏడీఎంకే ను తిరస్కరించనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ స్పష్టంగానే చెప్పేశాయి. నిజానికి ఇక్కడ ప్రాంతీయ పార్టీలదే పెద్దన్న పాత్ర. జాతీయ పార్టీలు ఏదో కూటమిలో చేరి తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ఉంటాయి. గత నాలుగు దశాబ్దాలుగా ఇదే తంతు. బీజేపీ నరేంద్రమోడీ హయాంలో కి వచ్చిన తర్వాత తమిళనాడు పరిస్థితులను సైతం శాసించాలని చూశారు. శశికళను ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకున్నారు . తాము చెప్పినట్లు వినే పళని స్వామి, పన్నీరు సెల్వాలకు బాధ్యతలు అప్పగించారు. ఏఐఏడీఎంకే పెద్ద మెజార్టీతో లేకపోయినా కేంద్రం అండదండలతో పూర్తి కాలం అధికారంలో ఉండేలా చూశారు. అందువల్ల ఈసారి ఏఐడీఎంకే అధికారంలోకి వస్తే పూర్తిగా పగ్గాలు కేంద్రం అధీనంలో ఉన్నట్లే లెక్క. అయితే తమిళ తంబీలు ఏఐఏడీఎంకే పై పెద్దగా వ్యతిరేకత లేకపోయినా డీఎంకేకే పట్టంగట్టినట్లుగా ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అంటే మరోసారి జాతీయ పార్టీలకు ఇక్కడ సీన్ లేదని చాటిచెప్పడమే.

# ఆ విషయంలో మాత్రం బాబు బాటలోనే జగన్



విజయవాడ, మే 3, (న్యూస్ పల్స్) రాజకీయం అంటేనే కఠినాతికఠినం. అక్కడ చాణక్య నీతి అమలు అవుతుంది. తరతమ భేదాలు అసలు పాటించరు. తమ ఎదుగుదలకు అడ్డు అనుకుంటే ఎవరి మీదనైనా కచ్చితంగా వేటు వేస్తారు. తొక్కేసి మరీ ముందుకు సాగుతారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం చంద్రబాబు ఇదే అమలు చేశారు. ముందు పిల్లను ఇచ్చిన మామ ఎన్టీయార్ కి వెన్నుపోటు పొడిచారు. ఆ తరువాత తనను నమ్మి వెంట వచ్చిన బావమరుదులు, తోడల్లుడు, ఇతర బంధువులకు కూడా పొలిటికల్ పంజా విసిరి దెబ్బ రుచి చూపించారు. ఇపుడు తానూ లోకేష్ తప్ప ఎవరూ టీడీపీకి సిసలైన బంధువులూ కాదు, ఎవరికీ పేటెంటు హక్కులూ అసలు లేవు.మరి జగన్ ఇపుడు చేస్తున్నది ఏంటి అన్న చర్చ కూడా సుదీర్ఘ కాలంగా తెలుగు రాజకీయాలను చూస్తున్న వారికి వస్తోంది. తాను జైలులో ఉన్నపుడు తన కోసం మూడు వేల పై చిలుకు కిలోమీటర్లను ఉమ్మడి ఏపీలో నడచిన ఆడకూతురు ఇంటి ఆడపడుచు షర్మిలకు ఏ చిన్న పదవీ ఇవ్వకుండా జగన్ దూరం పెట్టడం చూస్తే చంద్రబాబు ఫార్ములానే వాడారా అన్న అనుమానం అయితే రాక మానదు. లేకపోతే షర్మిల పార్టీకి చేసిన సేవలకు గాను రాజ్యసభ సీటు ఇచ్చి ఢిల్లీలో ఆమెను పార్టీ తరఫున నమ్మకమైన నేతగా పెట్టుకుంటే తప్పేముంది అన్న వారూ వైసీపీలో ఉన్నారు. నిజానికి జగన్ జైలులో ఉన్న వేళ షర్మిల అనే ఆమె పార్టీని భుజానికెత్తుకోకపోతే ఈ రోజున జగన్ సీఎం సీటును అందుకునే వారు కాదు అన్న చర్చ కూడా ఉంది.అచ్చం చంద్రబాబు మదిరిగానే ఇక్కడ జగన్ ఆలోచిస్తున్నారు అన్నదే అందరి మాటగా ఉంది. తన కుమారుడు లోకేష్ ని తప్ప ఎవరినీ చంద్రబాబు నమ్మకపోతే జగన్ తన సతీమణి భారతిని తన వారసురాలిగా చూస్తున్నారు అంటున్నారు. భారతికి రాజకీయంగా అవకాశాలు కల్పించినా పదవి తమ ఇంట్లోనే ఉంటుంది అన్న దూరాలోచనతోనే జగన్ ఇలా చేస్తున్నారు అన్న విశ్లేషణ కూడా ఉంది. జగన్ ఇప్పటికైతే యువకుడు, పైగా మూడు దశాబ్దాల పాటు సీఎం గా రాజ్యం చేయాలన్న ఆశ కూడా ఉంది. అయితే అనుకోని సమస్యలు వచ్చిపడితే బీహార్ లో లాలూ ప్రసాద్ చేసిన మాదిరిగా జగన్ సతీమణికే ఓటు వేస్తారు అంటున్నారు. అందుకే కావాలనే షర్మిలను దూరం పెట్టారు అని అంటున్నారు.టీడీపీలో నందమూరి ఫ్యామిలీ కరివేపాకు మాదిరిగా చంద్రబాబు వాడుకుని వదిలేశారు అన్నది ఇప్పటికీ విమర్శ. దాన్ని తిరగరాసేలా జగన్ సైతం షర్మిల విషయంలో వ్యవహరిస్తున్నారు అంటున్నారు. వైఎస్సార్ కి తానే ఏకైక వారసుడిని అన్న భావనతోనే ఆయన ముందుకు సాగుతున్నారు అని చెబుతున్నారు. ఇక్కడ చెప్పుకోవాల్సింది ఏంటి అంటే షర్మిలకు మంచి వాగ్దాటి ఉంది. జనాకర్షణ కలిగిన నాయకురాలు అని కూడా చెప్పాల్సిందే. వేలాది మంది జనాలను కదలకుండా ప్రసంగాలు చేయడంలో ఆమె నేర్పు సాధించారు. వైఎస్సార్ హావభావాలు పుణికి పుచ్చుకోవడం కూడా ఆమెకు అదనపు ఆకర్షణ. మరి ఈ రకమైన నాయకత్వ లక్షణాలే వైసీపీలో ఆమెకు ఉన్నత స్థానం దక్కకుండా చేశాయా అన్న చర్చ అయితే ఉంది. ఏది ఏమైనా ఇక్కడ చంద్రబాబా? జగనా? అన్నది ముఖ్యం కాదు, ఇది ఫక్త్ రాజకీయం, చాణక్యుడు చెప్పినట్లుగా విజయమే ప్రధానం. అందువల్ల ఎవరినైనా తొక్కుకుని పోవాల్సిందే. ఆ విధంగా చూస్తే చంద్రబాబు చేసింది కూడా తప్పు కాదేమోనని అంతా అంటున్న మాట.

# పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా అసంతృప్తి జ్వాలలు

తిరుపతి, మే 3, (న్యూస్ పల్స్) మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికే సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారనే విషయం.. చిత్తూరు జిల్లాలో పెద్ద టాక్‌గా మారింది. ఒక్క జిల్లాలోనే కాకుండా మంత్రి వర్గంలోనూ పెద్దిరెడ్డి విషయం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. గత నెలలో జరిగిన స్థానిక ఎన్నికల్లోను, తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ చిత్తూరు జిల్లా సహా సీమలోని జిల్లాల్లోనూ పెద్దిరెడ్డి తన సత్తా చాటారనే విషయంలో సందేహం లేదు. దీంతో జగన్ దగ్గర ఆయన హవా పెరిగింది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే పెద్దిరెడ్డి సొంత జిల్లా చిత్తూరులోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో? అనేక విషయాల్లో వేలు పెట్టేస్తున్నారని మంత్రులు, ఎమ్మెల్యేలు గగ్గోలు పెడుతున్నారు. పెద్దిరెడ్డిపై జగన్‌కు పలు మార్లు ఫిర్యాదులు వెళ్లినా ఆయన మాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇక, ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయనకు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక బాధ్యత కూడా అప్పగించారు.ఇంత వరకు బాగానేఉన్నా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దూకుడుతో చాలా మంది సీనియర్లు.. మీడియా ముందుకు రాలేక పోతున్నారనే వాదన ఉంది. నిజానికి పార్టీలో పెద్దిరెడ్డి కన్నా సబ్జెక్ట్ ఉన్న నేతలు, సీనియర్లు ఉన్నారు. ఎమ్మెల్యేలు, విప్‌లు కూడా తిరుపతి పార్లమెంటులో గెలుపు కోసం.. ప్రత్యక్షంగా పరోక్షంగా పనిచేస్తున్నారు. అయితే.. ఎవరినీ కూడా మీడియా ముందుకు రాకుండా పెద్దిరెడ్డి కట్టడి చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. దీనికి తోడు పెద్దిరెడ్డికే జగన్ కూడా ప్రాధాన్యం ఇస్తుండడంతో.. ఇటు పెద్దిరెడ్డిని ఏమీ అనలేక.. అటు పార్టీలో పనిచేయకుండా కూడా ఉండలేక.. సీనియర్లు అగచాట్లు పడుతున్నారు.చిత్తూరు జిల్లాకే చెందిన మరో మంత్రి నారాయణ స్వామి పరిస్థితి కూడా ఇలానే ఉంది. అదేవిధంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి వంటివారు సైతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కే ఇంత ప్రాధాన్యం ఇస్తే.. మా పరిస్థితి ఏంటి ?



అనే ఆవేదనలో ఉన్న మాట వాస్తవం. ఇక రోజా పెద్దిరెడ్డి విషయంలో ఎలా కారాలు మిరియాలు నూరతారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొందరు సర్దు బాటు చేసుకుని ముందుకు వస్తున్నారు. మరికొందరు ఇంటికే పరిమితమవుతున్నారు. ఇంటికే పరిమిత మైన వారిలో ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి సహా మరికొందరు మౌనం పాటిస్తున్నా రు.రికొన్ని రోజుల్లోనే మంత్రి వర్గ ప్రక్షాళన ఉన్న నేపథ్యంలో ఆదిలో 90శాతం మందిని మారుస్తానని సీఎం జగన్ ప్రకటన చేసినా.. మారిన పరిస్థితులు, వచ్చే ఎన్నికల నాటికి మారే పరిణామాలను దృష్టిలో ఉంచు కుని.. కొద్దిమందిని అలానే ఉంచుతారని అంటున్నారు. ఈ జాబితాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో ఆయనపై గుస్సాగా ఉన్నవారు కూడా మౌనంగా ఉంటున్నారు. మొత్తానికి తిరుపతిలో పాజిటివ్ ఫలితాల తర్వాత.. వైసీపీలో పెద్దిరెడ్డి మరింత క్రియాశీలక పాత్ర పోషించడం కంటిన్యూ కానుండడంతో. పార్టీలో ఆయన టార్గెట్‌గా అసంతృప్తి జ్వాలలు మరింతగా పెరిగే ఛాన్స్ కూడా ఉంది.

# రాజకీయ ఉపాధి పథకంలో కింగ్

నెల్లూరు,మే3,(న్యూస్ పల్స్)జకీయాల్లో ఉన్న వారికి పని ఉండదా అంటే ఉంటుంది. కళ్ళు పెట్టి చూస్తే చాలానే కనిపిస్తుంది. అసలు భారతదేశం లాంటి చోట్ల గజానికి డజను సమస్యలు పోగై ఉంటాయి.వాటిని పట్టించుకుని పోరాడవచ్చు. కానీ అన్ని సమస్యలూ హైలెట్ కావు. జనాల అటెన్షన్ లోకి వెళ్లవు, ఎక్కడైతే అధికార పార్టీ ఇరుకున పడుతుందో వాటిని పట్టుకుని గట్టిగా వేలాడితే ఆ పొలిటికల్ గెయిన్ చాలానే వస్తుంది. ఢీ అంటే ఢీ అన్న పాలిటిక్స్ ఉన్న చోట ఇది మరింత ఎక్కువగా వర్కౌట్ అవుతుంది. ఏపీలో చూసుకుంటేటీడీపీ వైసీపీల మధ్య నిత్యాగ్నిహోత్రం అలా రగులుతూనే ఉంటుంది.ఇకజగన్,చంద్రబాబులమధ్యపచ్చగడ్డిని పెట్టినా అగ్గిపుల్ల కూడా అక్కరలేకుండానే భగ్గుమంటుంది.జగన్ విషయంలో అదే పెద్ద సమస్య.తానుపట్టిన కాళ్ళకు మూడే కాళ్ళు అనే రకం. ఆయన అనుకున్నది జరిగిపోవాలంటారు. ఏడాది పాటు నిమ్మగడ్డ రమేష్ కుమార్‌తో తెగేదాకా లాగిన ఎపిసోడ్ చూసిన వారికి జగన్ అంటే పూర్తిగా తెలిసివచ్చింది. ఇక కాదు అంటే అవును అనే విపక్ష రాజకీయ ఏపీలో ఉండగా జగన్ ది ఎపుడూ వన్ సైడ్ పాలిటిక్స్ గానే ఉంటుంది. ఆయన ప్రతీ సారి అడ్డంగా దొరికిపోతూంటారు. దానివల్లవిపక్షాలకుఅజెండా ఆయనే చక్కగా అందిస్తారు. ఇంటర్,టెన్త్ పరీక్షలవిషయంలోజగన్‌చేస్తోంది మంచి అనుకుంటు న్నారు. కానీ అక్కడ విద్యార్ధుల తల్లిదండ్రుల మూడ్ ని ఆయన పట్టించుకోవడంలేదు అన్న విమర్శ అయితే ఉంది.ఏపీలో అసలు కరోనా ఎలా విస్తరించింది అన్నది అందరికీ తెలిసిందే. వైసీపీ లోకల్ బాడీ ఎన్నికలకు వద్దు అంటే విపక్షాలు కావాలంటూ కోర్టు మెట్లు ఎక్కాయి. ఇక నాటి ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అయితే సరేసరి. మొత్తానికి అంతా కలసి జగన్ వద్దన్నాడు అన్న ఒకే ఒక్క దాన్ని పట్టుకుని ఎన్నికలు పెట్టించారు. దాంతోనే ఏపీలో కరోనా వ్యాపించింది అన్నది అంతా ఒప్పుకుంటారు. ఇక తిరుపతి ఉప ఎన్నికల్లో తండ్రీ కొడుకులు టీడీపీ తరఫున ఏకంగా పక్షం రోజుల పాటు కలియతిరిగేసినపుడు కూడా కరోనా గుర్తుకురా లేదు.ఇపుడు ఏపీలో పరీక్షలు నిర్వహిస్తామంటే మాత్రం కరోనా పేరిటరాజకీయమాడుతున్నారు.సరేరోజురోజుకూకరోనా పెరుగుతోం ది కాబట్టి జగన్ కూడా తగ్గి ఉండాల్సింది అన్న మాట అయితే ఉంది. కానీ జగమొండి జగన్ కాబట్టే విపక్షాలు మేత బాగా దొరుకుతోంది. తిరుపతి ఉప ఎన్నిక తరువాత ఆవురావురు మని ఉన్న వారికి ఇపుడు కొత్త ఆయుధం దొరికింది. పైగా ఏపీలో జగన్ విధానాల వల్లనే కరోనా ఎక్కువ అవుతోంది అని బురద కూడా జల్లేస్తున్నారు.ఎక్కడో అమెరికాలో ఉండే ప్రజా శాంతి ప్రెసిడెంట్ పాల్ కూడా విశాఖలో దీక్ష చేసేలా చేస్తున్నారు అంటే జగన్ ఏ ఒక్క విపక్షాన్ని వదలడంలేదు. తనదైన పోకడలతో వారికి చక్కగా అస్త్రాలు అందిస్తున్నారు అనుకోవాలి. రెస్ట్ తీసుకుంటున్న జనసేనాని కూడా జగన్ మీద లేఖాస్త్రాలు సంధించడానికి సరిపడే రాజకీయ సరుకులను జగన్ ఏదో ఒకటి తెచ్చి మరీ ఇస్తున్నారు అనుకోవాలి. సరే దీని వల్ల వారు పెరుగుతున్నారా జగన్ తగ్గుతున్నారా అన్నది చర్చ కాదు కానీ ప్రతీ రోజూ ఏదో ఒక తలనొప్పి ఉంటే పాలకులకు ఎలా తోస్తోంది అన్న మాట అయితే ఉంది. ఏది ఏమైనా విపక్షానికి సమస్యలు కావాలి. కానీ వారికి శ్రమ లేకుండా జగన్ అందిస్తున్నా ఆయుధాలు ఒక్కోటీ ఏరుకుంటే రేపటి రోజున వారే బలంగా దూసుకువస్తారా అన్నదే ఇక్కడ డౌట్. ఇక ఉపాధి హామీ పథకం మాదిరిగా రాజకీయ నాయకుల చేతికి, నోటికీ పని మాత్రం జగన్ బాగా ఇస్తున్నాడు అన్నది మాత్రం నిజం

# కరోనా వార్డులను పరిశీలించిన ఎంపి అవినాష్ రెడ్డి

కడప కడప జిల్లాలో పలు ఆస్పత్రులలోని కరోనా వార్డులను ఎంపీ అవినాష్ రెడ్డి పిపిఇ కిట్లు ధరించి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారికి అందు తున్న వైద్యంపై వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం ఆస్పత్రుల యాజ మాన్యంతో మాట్లాడారు .కరోనా బాధితులకు అవాంతరాలేమీ లేకుం డా వైద్యం అందించాలని చెప్పారు. ఆయా ఆస్పత్రుల్లోని నోడల్ ఆఫీసర్స్ అందుబాటులో ఉంటున్నారా? లేదా, హెల్ప్ డెస్క్ మేనేజర్ ఉంటున్నారా? సిసి టీవి లు పని చేస్తున్నాయా? బాధితులకు ఆక్సిజన్ ఎంత పరిమాణంలో అందిస్తున్నారు? తదితర వివరాలడిగా రు. ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మాటలు కోటలు దాటుతున్నాయ్....

విజయవాడ, మే 3, (న్యూస్ పల్స్) ఏ సినిమా హిట్ కావాలన్నా కూడా కేవలం పంచ్ డైలాగులు ఉంటే సరిపోదు, యాక్షన్ పార్ట్ కూడా గట్టిగా దట్టించాలి. అపుడే మాస్ కి పూనకాలు వస్తాయి. అది పొలిటికల్ సినిమా అయితే వీర లెవెల్ లో యాక్షన్ సీన్లు ఉండాలి. టీడీపీ భావి వారసుడు లోకేష్ విషయానికి వస్తే ఈ మధ్యన బాగానే డైలాగులు వదులుతున్నాడు. జగన్ రెడ్డీ అంటూ దీర్ఘాలు తీస్తూ సెటైర్లు వేస్తున్నాడు. వైసీపీ సర్కార్ కి డెడ్ లైన్లూ పెడుతున్నాడు. వార్నింగులు ఇస్తూ ఎమోషన్ సీన్లు పండిస్తున్నాడు. కానీ మ్యాటరేంటి అంటే అవన్నీ జూమ్ యాప్ దగ్గరే ఆగిపోతున్నాయి.అమరావతి రాజధానిని మూడుగా చేస్తానని జగన్ సర్కార్ అన్నపుడు లోకేష్ ఎలాంటి పోరాటం చేయాలి. తన తండ్రి చంద్రబాబు కలల రాజధాని ఏమీ కాకుండా పోతూంటే చినబాబు ఏ రేంజిలో ఊగిపోవాలి. తమ ప్రభుత్వాన్ని నమ్మి రైతులు భూములు ఇచ్చినపుడు వారి పక్షాన నిలిచి ఎంతలా అగ్గి రాజేయాలి. అక్కడే చినబాబు తేలిపోయాడు అంటున్నారు. ఇక తమ పార్టీ నేతలను వరసపెట్టి అరెస్టులు చేస్తూంటే కూడా ట్విట్టర్ లో ట్వీటడం తప్ప కార్యక్షేత్రంలోకి లోకేష్ రాలేదు అన్న విమర్శలు అయితే సొంత పార్టీలోనే ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే గత రెండేళ్ళల్లోనూ వైసీపీ సర్కార్ కి ఎదురు నిలిచి దూకుడుగా చేసిన ఉద్యమం ఏదైనా ఉందా అంటే చినబాబు ఫ్యాన్స్ ఏమని బదులిస్తారో.జగన్ ప్రభుత్వం ఫలానా తప్పు చేస్తోంది అని ట్వీట్ చేయడం వేరు, జూమ్ యాప్ లో స్పీచులివ్వడం వేరు. అదే బాధిత జనానికి భరోసాను ఇస్తూ కదం తొక్కడం వేరు. అధికార పార్టీ హడలెత్తేలా రాజకీయ పోరాటాలు చేస్తేనే ఏ నేత అయినా హైలెట్ అవుతారు జనంలోనూ సానుభూతి వస్తుంది. కరోనాకు ముందు చంద్రబాబు ఇసుక మీద పోరాటం చేశారు, మరి కొన్ని సమస్యల మీద వీధుల్లోకి వచ్చారు. ఇపుడు ఆయన రాకపోతే ఆ బాధ్యత భావి నేతగా భాసిల్లుతున్న లోకేష్ తీసుకోవాలి కదా అన్న చర్చ అయితే వస్తోంది.లోకేష్ జగన్ కి చేస్తున్న హెచ్చరికలు భారీ డైలాగులు అన్నీ కూడా ఆయన ఇంటి గడప దాటడంలేదనే కామెంట్స్ కూడా ఉన్నాయి. ఎక్కడో పొరుగు రాష్ట్రంలో కూర్చుని రాళ్ళేస్తే పట్టించుకుంటామా అని వైసీపీ నేతలు లైట్ గా తీసుకుంటున్నారు. చినబాబు అయినా అమరావతిలో కాపురం ఉంటూ సర్కార్ మీద గొంతెత్తి మాట్లాడితే ఆ కిక్కే వేరుగా ఉంటుంది కదా అన్న మాట కూడా ఉంది. ఎంతసేపూ లేస్తే మనిషిని కానూ అంటూ గర్జించడం వల్ల పరువు పోవడం తప్ప ఉపయోగం ఏమైనా ఉందా చినబాబూ అన్నదే సొంత పార్టీ నేతల గోల. డెడ్ లైన్లు పెట్టడం కాదు, ఆ తరువాత ఏం చేయాలో యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకున్నాకే నోరు విప్పాలి. లేకపోతే ఉడత ఊపులకు జగన్ సర్కార్ భయపడుతుందా. పైగా అక్కడ ఉన్నది జగన్. మరి లోకేష్ సినిమాలో డైలాగులు అదిరిపోతున్నాయి. ఇక యాక్షన్ పార్ట్ ఎపుడు అన్నదే తమ్ముళ్ళ సూటి ప్రశ్న

# కామినేనిని ఒంటరి చేసేశారు

విజయవాడ, మే 3, (న్యూస్ పల్స్)రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించాక సోము వీర్రాజు తన టీంతోనే పార్టీని నడిపిస్తున్నారు. ఆయన తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తూనే ఉన్నారు. ఏపీలో టీడీపీని బలహీనం చేసి రెండోస్థానంలోకి బీజేపీ రావాలన్న లక్ష్యంతో సోము వీర్రాజు పనిచేస్తున్నారు. ఈ లక్ష్యం కోసం తనకు అడ్డువస్తారని భావించిన సొంత పార్టీ నేతలను సోము వీర్రాజు పక్కన పెట్టారు. కొందరిపై పార్టీ వ్యతిరేక ముద్ర వేస్తూ ఓటు వేశారు.సోము వీర్రాజు తొలి నుంచి బీజేపీలో టీడీపీ కోవర్టులు ఉన్నారని అనుమానిస్తూనే ఉన్నారు. ఆయన పార్టీ అధ్యక్షుడు కాక మునుపు కూడా వారెవ్వరితో ఆయన కలిసేవారు కారు. తన పని తాను చూసుకునే వారు. ఎమ్మెల్సీగా పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను మాత్రమే సోము వీర్రాజు చూసుకునే వారు. ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు అయిన తర్వాత టీడీపీ కాంటాక్టులను కట్ చేయడానికే సోము వీర్రాజు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఆయన పెద్దగా సుజనాచౌదరి, సీఎం రమేష్ లాంటి వారితో కలవడం లేదు. తన టీంతోనే ముందుకు వెళుతున్నారు. అయితే ఇటీవల సోము వీర్రాజు జగన్ కు రాసిన లేఖ సొంత పార్టీలోనే సంచలనంగా మారింది. చంద్రబాబు హయాంలో వైద్య పరికరాల కొనుగోళ్లపై ప్రభుత్వం సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై విచారణ జరపాలని సోము వీర్రాజు స్వయంగా ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు లేఖ రాశారు.అప్పటి చంద్రబాబు మంత్రి వర్గంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కామినేని శ్రీనివాస్ ఉండేవారు. ఆయన బీజేపీ నేతే. సుజనా బ్యాచ్. దీంతోనే వైద్య పరికారల కొనుగోళ్లపై విచారణ జరపాలని సోము వీర్రాజు జగన్ కు లేఖ రాసినట్లు పార్టీలో చర్చించుకుంటున్నారు. కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అయితే వీర్రాజు లేఖ చంద్రబాబు కంటే సొంత పార్టీ నేత కామినేని శ్రీనివాస్ ను టార్గెట్ గా చేసుకున్నట్లుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే దీనిపై పార్టీ వర్గాలు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 300 కోట్ల కుంభకోణం విషయంలో నిజాలు వెలుగు చూడాలన్నదే సోము వీర్రాజు లక్ష్యమని, వ్యక్తులు కాదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

# హాస్పిటల్ బెడ్ పైనే మృతదేహం

విజయవాడ వీరులపాడు మండలం కొనతాలపల్లి గ్రామానికి చెందిన 55 సంవత్సరాల మార్తమ్మఅనేమహిళగతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుం ది. ఆదివారం నిన్న సాయంత్రం చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం వచ్చిన మార్తమ్మకు సిబ్బంది కరోనా టెస్ట్ చేయించారు. తరువాత చికిత్స చేస్తుండగామార్తమ్మ మృతి చెందింది. మృతి చెందిన మార్తమ్మ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు హాస్పిటల్ లోనే వదిలి వెళ్ళిపోయారు. ఆదివారం నుండి హాస్పిటల్ బెడ్ పైనే ఉన్న మార్తమ్మ మృతదేహం పడివుంది. ఇటు కుటుంబ సభ్యులు కాని అటు హాస్పిటల్ సిబ్బంది కాని మార్తమ్మ మృతదేహాన్ని పట్టించుకోవడంలేదు. కరోనా రిజల్ట్ వచ్చిన తర్వాతనే తీసుకువెళ్తామంటున్న కుటుంబ సభ్యులు.అత్యవసర విభాగంలో మార్తమ్మ మృతదేహనం ఉండటంతో చికిత్స నిమిత్తం వచ్చే వారు భయపడుతున్నారు. అదే హాస్పిటల్ లో కరోనా టెస్ట్ లు జరుగుతున్నాయి. అలానే కరోనా కి వ్యాక్సినేషన్ కోసం హాస్పిటల్ కి వచ్చే వారు భయపడుతున్న పరిస్థితి వుంది. హాస్పిటల్ లో చనిపోయిన మహిళకు కాని హాస్పిటల్ సిబ్బంది కాని కనీసం కరోనా కిట్లు లేవు.

# వ్యక్తి అనుమానస్పద మృతి

పితాపురంతూర్పుగోదావరి జిల్లా పిఠాపురం పట్టణం శివారు అగ్రహారం పశువుల సంత వద్ద సోమవారం ఉదయం వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చనిపోయిన వ్యక్తి పిఠాపురం భీమ్ నగర్ కి చెందిన తాపీ మేస్త్రి దువ్వాడ అప్పలరాజు(35) అనే వ్యక్తి గా గుర్తించారు. అగ్రహారం పశువుల సంత ఎదురుగా తలపై బలమైన గాయంతో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడిని ఎవరైనా హత్య చేశారా, మరే ఇతర కారణాలతోనైనా మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పిఠాపురం పట్టణ ఎస్సై బి.శంకరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుండి మృతుడి వివరాలు సేకరించారు. మృతుడ భీమ్నగర్ వద్ద నివాసముండేవాడని, ప్రస్తుతం అగ్రహారంలో నివాసముంటున్నాడని స్థానికులు చెబుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మరణ మృదంగం

హిందూపురం అనంతపురం జిల్లా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు కరోనా బాధితులు మృతిచెందారు. ఆక్సిజన్ అందకే వీరు మరణించినట్లు మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వారు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిర్లక్ష్యంగా వ్యవహరించి.. ముగ్గురు మృతిచెందడానికి కారణమైన ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు మరణాలపై అధికారులు వివరణ ఇచ్చారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న కోవిడ్ ఆస్పత్రిలో సోమవారం తెల్లవారుజామున ఎనిమిది మంది రోగులు చనిపోవడంపై ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ దివాకర్ స్పందిం చారు.ఆక్సిజన్ కొరత ఉన్న సమయం లో వెంటనే స్పందించినప్పటికి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న వాళ్ళు మృతి చెందారని తెలిపారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో కరోనా రోగులకు సకాలంలో ఆక్సిజన్ అందకపోవడం ప్రభుత్వం కచ్చితంగా వైఫల్యంమేనని బీజేపీ.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు.కరోనా విజృంభిస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన యంత్రాంగం నిర్లక్షంగా వ్యవహరించిందని,ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.

## ఈఎస్ఐ ఆసుపత్రికి శంకుస్థాపన

కాకినాడ దాదాపు రూ.100 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యమున్న కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి, కార్మిక సోదరులకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ తెలిపారు.తూర్పుగోదావరి జిల్లా స్థానిక సాంబమూర్తినగర్లో కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నరసాపురం ఎమ్మెల్యే ఎం.ప్రసాద్రాజుతో కలిసి ఎంపీ వంగా గీత ఈఎస్ఐ నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందులు ఈ ఆసుపత్రి నిర్మాణంతో తొలగిపోతాయని, వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం వెళ్లాల్సిన బాధ తప్పుతుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పరిశ్రమలు ఉన్నాయని, వీటిలో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులను కలుపుకొని దాదాపు రెండు లక్షల మంది ప్రజలకు ఈ ఆసుపత్రి ద్వారా సేవలు అందనున్నట్లు వివరించారు. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సురేష్కుమార్ గంగ్వార్ ఎంతో సహకారం అందించారని, గతేడాది ఫిబ్రవరిలో శంకుస్థాపన జరిగినప్పటికీ టెండర్ ప్రక్రియ, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని వివరించారు. ఇప్పుడు అన్నీ సిద్ధమవడంతో నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి కాబట్టి పనులు త్వరగా జరుగుతాయని, దాదాపు 15 నెలల్లో పనులు పూర్తయ్యేలా ఇంజనీర్లు ప్రణాళికలు రూపొందిం చినట్లు ఎంపీ వెల్లడించారు.కాకినాడ పట్టణ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ సహకారంతో అధునాతన ఈఎస్ఐ ఆసుపత్రి కల సాకారమవుతోందని, ఆమె ఎంతో పట్టుదలతో కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఆసుపత్రి కోసం కృషిచేశారని పేర్కొన్నారు. కాకినాడతో పాటు జిల్లాలోని కార్మిక సోదరులందరూ ఆమెకు రుణపడి ఉంటారని, ఈ ఆసుపత్రి ద్వారా అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ ఆసుపత్రి కల సాకారమవుతుండటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పాటు ఎంపీ కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు.

## కరోనా రోగులకు అండదండలు గా మేముంటాం

రాజమహేంద్రవరం కరోనా వచ్చిందని, ఎవ్వరూ దగ్గరకు రానీయడం లేదని ఏ ఒక్కరూ మానసికంగా కృంగిపోనవసరం లేదని, వారికి అన్ని విధాలా అండగా తాముంటామని అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అభయమిచ్చారు. రాజమహేంద్రవరం అర్బన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆకుల సత్యనారాయణ సొంత నిధులతో కొనుగోలు చేసిన వాహనాన్ని రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్, ఎంపి మార్గాని భరత్ రామ్ ముఖ్య అతిధులుగా ఆవిష్కరించారు. ఈ వాహనాన్ని కరోనా బారినపడి మృతి చెందిన వారిని అంత్యక్రియలు నిమిత్తం శ్మశాన వాటికకు తరలించే నిమిత్తం వినియోగించనున్నారు. ఈ వాహనానికి "ప్రశాంతంగా చివరి ప్రయాణం"గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా కారణంగా మృతి చెందిన వారిని తరలించేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని ఎందరో తన దృష్టికి తీసుకువచ్చారని, దానిని దృష్టి లో ఉంచుకుని ఈ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా డాక్టర్ ఆకుల సత్యనారాయణ సేవలను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాశ్చంద్రబోస్, ఎంపి మార్గాని భరత్ రామ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపి మార్గాని భరత్ లను డాక్టర్ ఆకుల సత్యనారాయణ శాలువాలు కప్పి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, రాజమహేంద్రవరం రూరల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గుడికి పోలేదని

భీమవరం కుమార్తె పుట్టినరోజు సందర్భంగా కుటుంబం మొత్తం గుడికి వెళ్లాలని ఆమె ఆశపడింది. కానీ.. గుడికి తీసుకువెళ్లేందుకు భర్త అంగీకరించలేదు. దీంతో.. మనస్తాపానికి గురై మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో చోటుచేసుకోగా... ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బలుసుమూడి ఎస్టీ కాలనీలో దొడ్డా సురేష్ భార్య సత్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత నెల 28వ తేదీన వారి కుమార్తె పుట్టినరోజును పురస్కరించుకుని సత్య దేవాలయానికి తీసుకువెళ్లమని భర్తను కోరింది. అందుకు సురేష్ నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు భీమవరం టూటౌన్ ఏఎస్ఐ ఎస్ఆర్ మూర్తి తెలిపారు.

# బొక్క బోర్లా పడ్డ బీజేపీ

తిరుపతి, మే 3, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీ ఆశలు ఫలించలేదు. తిరుపతి ఉప ఎన్నికల్లో ప్రజలు దానికి గట్టి షాక్ ఇచ్చారు. అసలు పోటీలోకి కూడా పరిగణనలోకి తీసుకోనట్లే కన్పించింది. ఆర్భాటం తప్ప బీజేపీకి జనాల్లో విషయం లేదన్నది తిరుపతి ఉప ఎన్నికల ఫలితాల్లో స్పష్టమయింది. ఇంత దారుణ ఫలితాలు వస్తాయని ఆ పార్టీ నేతలు కూడా ఊహించి ఉండరు. కేంద్ర ప్రభుత్వం వైఖరి తిరుపతి ఉప ఎన్నిపై ప్రభావం చూపిందనే చెప్పాలి. జనసేనతో కలసి పోటీ చేయడంతో తాము ప్రభావం చూపగలమని భావించారు.తిరుపతి ఉప ఎన్నికలో అభ్యర్థిగా ఆచితూచి అన్నీ లెక్కలు వేసి మాజీ ఐఏఎస్ అధికారి రత్న ప్రభను నిర్ణయించారు. ఆమె ఎంపిక కరెక్టే. అందులో ఏమాత్రం సందేహం లేదు. కానీ రత్న ప్రభ వ్యక్తిత్వం, ఆమె ఇమేజ్ కంటే బీజేపీ పై వ్యతిరేకత ఎక్కువగా పనిచేసిందనే చెప్పాలి. ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడా బీజేపీ ప్రభావం చూపలేకపోయింది. హిందుత్వ నినాదాన్ని భుజాన వేసుకుని, తిరుపతి వైసీపీ అభ్యర్థి గురుమూర్తి మతం, కులంపైనా, తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతుందని ఎంత యాగీ చేసినా ప్రజలు ఆ వైపు చూడలేదనే చెప్పాలి.ఇక్కడ ఒక విషయం అర్థమయింది ఏమిటంటే జనసేన ఓట్లు కూడా బీజేపీకి పడలేదు. జనసేన క్యాడర్ మొత్తం టీడీపీకే ఓట్లు వేసినట్లు స్పష్టంగా కనపడుతుంది. పవన్ కల్యాణ్ స్వయంగా వచ్చి ప్రచారం చేసినా తనకున్న ప్రధానమైన ఓటు బ్యాంకును బీజేపీ వైపు మరల్చుకోలేకపోయారు. ప్రధానంగా బలిజ సామాజికవర్గం ఓట్లు బీజేపీ అభ్యర్థికి పడలేదు. జనసేన అధినేత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్వయంగా అదే సామాజికవర్గమయినా వారు టీడీపీ వైపు చూశారని చెప్పాలి. అందుకే కనీస ఓట్లను కూడా సాధించలేకపోయింది.దీనికి కారణం తిరుపతి ఉప ఎన్నికలో తాము పోటీ చేయడానికి జనసేన అక్కడ ప్రయత్నించింది. కానీ తొలి నుంచి జనసేన పోటీకి బీజేపీ నేతలు అడ్డుతగిలారు. పవన్ కల్యాణ్ తో చర్చించకముందే తామే పోటీ చేస్తామని ప్రకటించడం వంటివి జనసేన పార్టీ క్యాడర్ కు ఆగ్రహాన్ని తెప్పించాయంటున్నారు. అందుకే బీజేపీకి తిరుపతి ఉప ఎన్నికలో దారుణమైన ఓటమిని చూడాల్సి వస్తుంది. టీడీపీని దాటి సెకండ్ ప్లేస్ కు వస్తామని భావించిన ఆ నేతలు కాంగ్రెస్ ను మాత్రం వెనక్కు నెట్టగలిగారు. వైఎస్సార్‌సీపీ మెజార్టీ 2 లక్షల 25 వేలు దాటింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గురుమూర్తి ఆధిక్యంలో దూసుకెళ్తున్నారు. పోస్ట్ బ్యాలెట్ల నుంచి.. సాధారణ ఓట్ల లెక్కింపులోనూ వైఎస్సార్‌సీపీ హవా కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 2,25,773 ఓట్ల ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గురుమూర్తి దూసుకెళుతున్నారు.వైఎస్సార్‌సీపీ- 4,61,366(57 శాతంటీడీపీ- 2,55,271 (31.5 శాతం)బీజేపీ -43,317 (5.4 శాతం)కాంగ్రెస్- 7,233(0.9 శాతం)సీపీఎం- 4,232 (0.6 శాతం)ఇతరులు- 26,316 (3.3 శాతం) నోటా-11,509 (1.4 శాతం)అంతే తప్ప తిరుపతిలో బీజేపీ సాధించిందేమీ లేదు?

### బీజేపీపై సోషల్ మీడియాలో సెటైర్లు

తిరుపతి ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ దూసుకెళ్లింది.. భారీ మెజార్టీని దక్కించుకుంది. మొదటి రౌండ్ నుంచి గురుమూర్తి ఆధిక్యంలో కొనసాగారు. టీడీపీకి రెండో స్థానంలో నిలిచింది.. బీజేపీకి మూడో స్థానంలో ఉంది. తిరుతిపై భారీగా ఆశలు పెట్టుకున్న బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి రత్నప్రభకు పరాభవం తప్పలేదు. ఒక్క రౌండ్‌లో కూడా ఆ పార్టీకి ఆధిక్యం కనబడలేదు.. ఆమెకు నామమాత్రపు ఓట్లు మాత్రమే దక్కాయి. ఇరు పార్టీల కార్యకర్తలు ఈ ఫలితంతో తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారనే చెప్పాలి. ఎలాగైనా సత్తా చూటాలనుకున్న బీజేపీకి నిరాశ తప్పలేదు.తిరుపతి ఉప ఎన్నికల ఫలితాలు, బీజేపీకి పరాభవంపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. కమల దళానికి ఈసారి కొంత ఊరట లభించిందని నెటిజన్లు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. నోటా కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయంటున్నారు.. అది కూడా పవన్ కళ్యాణ్ పుణ్యమే అంటూ కొత్త లాజిక్ తెరపైకి తెస్తున్నారు. జనసేన పార్టీతో కలిసి పోటీ చేయకపోయుంటే ఆ మాత్రం కూడా ఓట్లు వచ్చేవి కాదంటున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల లాజిక్‌ను తెరపైకి తెస్తున్నారు.2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. అప్పుడు నోటాకు 25,781 ఓట్లు వస్తే.. బీజేపీ అభ్యర్థి బొమ్మి శ్రీహరిరావుకు 16,125 ఓట్లు మాత్రమే వచ్చాయి. జనసేనతో పొత్తు పెట్టుకున్న బీఎస్పీకి 20,971 ఓట్లు వచ్చాయి. అందుకే ఈసారి బీజేపీకి నోటా కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయంటూ పరోక్షంగా ట్వీట్‌లు చేస్తున్నారు. ఏపీ బీజేపీ కూడా తిరుపతిలో గెలుస్తామనే ధీమాను వ్యక్తం చేసింది.. కానీ ఫలితం మాత్రం ఆ పార్టీకి పెద్ద షాక్ ఇచ్చింది. అయితే బీజేపీ, టీడీపీలు మాత్రం అధికార పార్టీ అక్రమాలు చేసిందని ఆరోపిస్తున్నాయి. ఈ ఫలితాలపై జనసేన, బీజేపీలు ఎలా స్పందిస్తాయన్నది చూడాలి

## విద్య ,వైద్య ,ఉపాధి హక్కుల సాధనకై ఏ ఐ వై ఎఫ్ నిరంతర పోరు

ఎమ్మిగనూరు పట్టణంలో భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని, విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏ ఐ వై ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని. అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ అన్నారు. ఏఐవైఎఫ్ 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మిగనూరు లోని స్థానిక సిపిఐ పార్టీ భవన్ ముందు ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏ ఐ వై ఎఫ్ జెండాను అవిష్కరణ చేశారు.అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను, దేశభక్తి లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను మానవత్వాన్ని నెలకొల్పడానికి అఖిలభారత యువజన సమాఖ్య నిరంతరము కృషి చేస్తుంది అని అన్నారు. దేశం కోసం ప్రాణార్పణ చేసిన సర్దార్ భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు వారి స్ఫూర్తితో 1959 మే 3 తేదీన ఏ ఐ వై ఎఫ్ ఢిల్లీలో ఆవిర్భవించిందని.18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కోసం పోరాడి విజయం సాధించిందిన ఘనమైన చరిత్ర ఏ ఐ వై ఎఫ్ సొంతమని. కుల, మత, విచ్చిన్నకర వాదులకు ఎదురొడ్డి నిలిచింది. అంటరానితనం ,సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలకు ,వ్యతిరేకంగా యువతను పెడదోవ పట్టిస్తున్న మద్యపానం, అశ్లీల సాహిత్యం, అర్ధనగ్న సినిమాలకు వ్యతిరేకంగా "క్విట్ అశ్లీలత" పేరుతో పెద్ద ఎత్తున ఏ ఐ వై ఎఫ్ ఆందోళన కొనసాగిస్తుందని. దేశంలో అలాగే ఆంధ్ర రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం నిరుద్యోగ యువత తో సమరశీల పోరాటాలు నిర్వహిస్తు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షలకు పైబడిన ఉద్యోగాలను భర్తీ చేయాలని పోరాటాలను నిర్వహిస్తుందని. కరోనా వైరస్ నేపథ్యంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు 5000 వేల రూపాయల ను యుద్ధ ప్రాతిపదికన ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సెక్రెటరీ కార్యదర్శి పంపన్న గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ మండల కార్యదర్శి సత్యన ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రాజు పట్టణ అధ్యక్షుడు ఎం రాజు ఐ ఎస్ నాయకులు వీరేష్ నరసింహులు పాల్గొన్నారు

## కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి**

నెల్లూరు కరోనా వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడుకడివేటి చంద్రశేఖర్ ప్రజలను కోరారు, గూడూరు పట్టణంలో ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మేడే పురస్కరించుకొని ప్రగతి సంస్థ సభ్యులు అందరూ కరోనా వ్యాక్సిన్ 2వ డోసువేయించుకున్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు కడివేటిచంద్రశేఖర్,ఉపాధ్యక్షుడు మాట్లాడుతూఏడాది కాలం నుంచి ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య కరోనా వైరస్ అని ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని అన్నారు. కరోనా ఫస్ట్ వేవ్‌తో ప్రమాదం ఏమీ లేదని.. కానీ కరోనా సెకండ్ వేవ్‌తో ప్రమాదం పొంచి ఉందని ప్రజలనుహెచ్చరించారు.ప్రజలు సాధ్యమైనంత వరకు కొన్నిరోజులు భౌతికదూరం పాటించడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. మాస్కులు ధరించాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బండి ధనంజయ రెడ్డి, వేమారెడ్డి సురేంద్ర నాథ్ రెడ్డి, సెక్రెటరీ. జి.చంద్రశేఖర్,ట్రెజరర్ కాటూరిశ్రీనివాసులు,ప్రజేంద్రరెడ్డి, ఐటీ ప్రభాకర్,పూర్ణచంద్ర డి ఎస్ ఆర్ మొబైల్ సుధీర్ వాట్సాప్ రాము కుమార్ కోఆర్డినేటర్ సతీష్ మరియు ఆసుపత్రిసిబ్బంది డి.మనోజ,తదితరులు పాల్గొన్నారు.

# తిరుగులేని విజయం

తిరుపతి, మే 3, (న్యూస్ పల్స్) ఏపీ రాజకీయాల్లో బలమైన పార్టీగా వైసీపీ నిలిచింది. వైసీపీని గట్టి సామాజిక పునాదుల మీద నిర్మించడంతో జగన్ సక్సెస్ అయ్యారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు పక్కన పెడితే పదేళ్ళుగా జగన్ చేసిన సోషల్ ఇంజనీరింగ్ ఫలితాలే ఇపుడు వరస విజయాలుగా వస్తున్నాయి అని చెప్పాలి. తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో గత మెజారిటీని నిలబెట్టుకోవడం ద్వారా తనకు తిరుగు లేదు అని వైసీపీ గట్టిగా చాటి చెప్పింది. అదే సమయంలో టీడీపీ ధాటీగా పోరాడినా కూడా వైసీపీ ముందు ఆగలేని పరిస్థితిని అంతా చూశారు.ఇక టీడీపీని పక్కన పెట్టి జనసేనతో జట్టు కట్టి తిరుపతి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీకి పరాభవమే మిగిలింది. మా తాతలు నేతులు తాగారు అంటే కుదరదు, ఎక్కడో ఢిల్లీలో మోడీని చూపితే జనాలు మెచ్చి ఓట్లు వేయరు. తామున్న చోట బలమేంటో చూపాలి. బహుశా అనుభవం వచ్చింది కాబట్టి ఈ తత్వం బీజేపీకి బోధపడి ఉండాలి. ఇక పవన్ తో కూటమి కట్టినా కూడా గట్టిగా ఆరు శాతం ఓట్లు తెచ్చుకోలేక డిపాజిట్లు గల్లంతు కావడం అంటే కాషాయం పార్టీకి జనాలు కషాయం తాగించినట్లే అనుకోవాలి. ఇక ఏపీలో రెండు బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. వాటికి కాదని చేసే మూడవ రాజకీయం చెల్లదు అని తిరుపతి ఫలితం స్ట్రాంగ్ మేసేజ్ ఇచ్చింది.ఇక ఇపుడు బీజేపీకి టీడీపీ తక్కున గుర్తుకురావడం ఖాయం. ఎందుకంటే 2014 ఎన్నికల్లో ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకుని నాలుగు ఎమ్మెల్యే సీట్లు రెండు ఎంపీ సీట్లు గెలుచుకున్న చరిత్ర ఉంది. ఎంత చెడ్డా ఇప్పటికీ ఏపీలో ముప్పై శాతానికి తగ్గకుండా ఓట్లు టీడీపీకి పడుతున్నాయి. దాంతో వచ్చే ఎన్నికల నాటికి జనసేన, టీడీపీలతో కలసి బీజేపీ కూటమి కట్టవచ్చు. అయితే ఈ కూటమి కట్టినా కూడా వైసీపీని ఎదిరించడం కష్టమనే తిరుపతి ఉప ఎన్నిక ఫలితం చెబుతోంది. ఇక్కడ వైసీపీకి 56 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ జనసేన కూటమికి 5 శాతం పైగా ఓట్లు వచ్చాయి.

టీడీపీకి 32 శాతం ఓట్లు వచ్చాయి. మరి ఈ కూటమి కుదిరినా కూడా 37 శాతం దగ్గరే ఆగిపోవడం ఖాయం.ఇక వచ్చే ఎన్నికలకు మూడేళ్ల వ్యవధి ఉంది. ఈ మూడేళ్లలో జగన్ ప్రభుత్వం మీద వ్యతిరేకత వస్తుంది అనుకోవాలి. అలా వచ్చే యాంటీ ఇంకెంబెన్సీ ఓట్లు ఈ మూడు పార్టీల కూటమి ఒక్కటిగా నిలిచి పంచుకున్నా కూడా వైసీపీని పడదోసి అధికారంలోకి రాలేరు అనే రాజకీయ లెక్కలు చెబుతున్నాయి. వైసీపీకి మీద మోజు ఎంత తగ్గినా యాభై శాతం ఓట్లు ఆ పార్టీ ఖాతాలో పక్కాగా ఉంటాయి. ఇక ఈ మూడు పార్టీలు మరో అయిదారు శాతం ఓట్లు అదనంగా సంపాదించినా కూడా 43 శాతం దగ్గరే ఆగిపోతారు. 2014 ఎన్నికల్లో కూడా 45 శాతం ఓట్లే వచ్చిన సంగతి ఇక్కడ గమనార్హం. నాటి ఊపు కూడా 2024 నాటికి బీజేపీకి మోడీకి, పవన్ కి కూడా ఉండకపోవచ్చు. కాబట్టి జగన్ ఓట్లు ఎంత తగ్గినా కూడా మళ్లీ విజయం ఆయనదే అని ఇప్పటికైతే చెప్పాల్సిందే.

## జీజీహెచ్లో రోగులకు, సహాయకులకు అన్నదానం, మాస్కులు పంపిణీ

నెల్లూరు భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కంది కట్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో సోమవారం రోగులకు మరియు సహాయకులకు అన్నదానం, మాస్కులు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపుమేరకు, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్ సూచనలు సలహాల మేరకు బిజెపి మహిళా మోర్చా నెల్లూరు జిల్లా విభాగం ఆధ్వర్యంలోఈకార్యక్రమంచేపట్టడం జరిగిందని సంతోషాన్ని వ్యక్తపరిచారు. రోజురోజుకు కంటికి కనిపించని కరోనావైరస్ విజృంభిస్తున్న నేపధ్యంలో మనసున్న దాతలు ప్రతి ఒక్కరూ తమ చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ సేవే మాధవ సేవగా తలంచి మానవతా దృక్పథంతో కరోనా వైరస్ నియంత్రణకు పార్టీలకు అతీతంగా, కులమతాలకు అతీతంగా తగు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే జిల్లా బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అన్నదానం తోపాటు మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు జి విజయశ్రీ, బుజ్జమ్మ లతోపాటు బిజెపి నాయకులు శ్రీకాంత్ తది

## రఘురాముడి వెనుక సైకిలా....కమలమా...



న్యూఢిల్లీ, మే 3, సీపీ రెబల్ ఎంపీ.. రఘురామ కృష్ణంరాజు వ్యవహారం మరింత ముదిరింది. ఏకంగా ఆయన వైసీపీ అధినేత, సీఎం, తనకు గత ఎన్నికల్లో టికెట్ ఇచ్చిన జగన్‌నే బద్నాం చేసేందుకు.. ప్రయత్నించడం. ఇప్పుడు ఏకంగా ఆయన బెయిల్ రద్దు కోరుతూ.. సీబీఐ కోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు వైసీపీలో చాలా హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటి వరకు అంతో ఇంతో చూసీ చూడనట్టు వ్యవహరించిన వైసీపీ నేతలు కూడా ఇప్పుడు ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై నిప్పులు చెరుగుతున్నారు. ఏకులా వచ్చి మేకయ్యాడంటూ.. కొందరు కారాలు మిరియాలు నూరుతున్నారు.ఈ క్రమంలో వైసీపీ అధిష్టానం కూడా రఘురామ కృష్ణంరాజు వెనుకాల ఎవరు ఉన్నారు? అనే విషయాన్ని నిశితంగా పరిశీలిస్తోంది. వాస్తవానికి ఇప్పటి వరకు రఘురామ కృష్ణంరాజు వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నాడని భావిస్తూ వచ్చిన వైసీపీ నాయకులు ఇటీవల తిరుపతి పార్లమెంటు ఉప పోరు సందర్భంగా .. మేం గెలిస్తే.. మీ(టీడీపీ) ఎంపీలతో పాటు మీ కనుసన్నల్లో మెలుగుతున్న రఘురామ కృష్ణంరాజుతో కూడా రిజైన్ చేయించాలి! అని సవాల్ విసిరారు. అంటే.. ఇప్పటి వరకు వైసీపీ నేతలు.. రఘు వెనుక టీడీపీ నేతలు ఉన్నారని.. వారే ఆయనను ఆడిస్తున్నారని.. వారి అండ చూసుకునే రెచ్చిపోతున్నాడని అనుకున్నారు.కానీ, ఇప్పుడు పరిణామాలు మారిపోయాయి. రఘురామ కృష్ణంరాజు వెనుక.. కేంద్రంలో చక్రం తిప్పుతున్న పార్టీ ఉందనేది వైసీపీ నేతలు దృఢంగా నమ్ముతున్నారు. ఎందుకంటే.. బెయిల్ రద్దు చేయించే సాహసం.. టీడీపీ అధినేత చంద్రబాబు ఎప్పటికీ చేయరు. అంతేకాదు.. ఇదే కనుక జరిగితే.. తనపైనే అపవాదు వస్తుందని.. పార్టీ కూడా ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటుందని బాబుకు ఒక అంచనా ఉంది. ఏదైనా ఉంటే.. విమర్శలతో సరిపెడతారు కానీ.. బెయిల్ రద్దు వరకు విషయాన్ని లాగే సాహసం మాత్రం రఘురామ కృష్ణంరాజుచేయడని వైసీపీ నేతలు గట్టిగానే నమ్ముతున్నారు.కేంద్రంలోని బీజేపీకి మాత్రం ఇక్కడ బలం ఉన్నా లేకుండా.. బలమైన పార్టీగా ఉన్న వైసీపీని డైల్యూట్ చేసేందుకు రఘురామ కృష్ణంరాజును వాడుకుంటుందంటున్నారు. బలమైన నాయకుడిగా ఉన్న జగన్‌ను తప్పించడమే పరమావధి. గతంలో తమిళనాడులోనూ ఇలాంటి ప్రయోగమే చేసి.. ఒక రాజకీయ అస్థిరతను తెచ్చేందుకు ప్రయత్నించింది. ఇప్పుడు ఏపీలోనూ జగన్ కనుక బెయిల్ రద్దయి.

## కోవిడ్ సెంటర్ ప్రారంభం

నూజివీడు నూజివీడు పట్టణంలో జీఎంహెచ్ హాస్పిటల్ లో కోవిడ్ సెంటర్ ను సబ్ కలెక్టర్ ప్రతిష్ట మంగైన్ ప్రారంభించారు. 80 పడకలతో ఏర్పాటుచేసిన హాస్పటల్ లో ఆక్సిజన్ అందుబాటులో ఉండే విధంగా సిలిండర్లను ఏర్పాటుచేసారు. . ప్రభుత్వగుర్తింపుపొందిన హాస్పటల్ లో టెస్టుచేసి కరోనా పాజిటివ్ వచ్చినవారికి 108, 104 కు కాల్ చేసి సమాచారం ఇచ్చిన వారికే ఈ ఆస్పత్రి లో బెడ్ అలాట్ చేస్తామని సబ్ కలెక్టర్ అన్నారు. ఇక్కడ కరోనా పాజిటివ్ వచ్చినవారికి వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా ఐదుగురు డాక్టర్లను నియమించారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారికి కావలసిన అన్ని రకాల మందులను సిద్ధంగా ఉన్నాయని ప్రజలు ఎవరు భయబ్రాంతుకులకు గురికావద్దని అన్నారు.

## ఒకే సిద్ధాంతంపై నడిచే ఏకైక పార్టీ బిజెపి

నల్లజర్ల దేశంలో ఒకే సిద్ధాంతంపై నడిచే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం బిజెపి ఇంచార్జి శెట్టిపల్లి శివనాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మార్పు తీసుకు వచ్చేందుకు మోదీ అనేక సంస్కరణలు చేయుడం జరుగుతుందని అన్నారు. అలాగే కుల, మత, కుటుంబ రాజకీయాలకు బిజెపి ప్రభుత్వం వ్యతిరేకమని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.

# అన్నీ తానై పరువు కాపాడిన విజయన్



తిరువనంతపురం, మే 3, ఈశాన్యాన త్రిపుర, తూర్పున పశ్చిమ బెంగాల్, దక్షిణాన కేరళ ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటల్లా ఉండేవి. వీటిల్లో త్రిపుర, బెంగాల్ లో సీపీఎం పట్టు దశాబ్దాల పాటు కొనసాగింది. కేరళలో మాత్రం పడిలేస్తూ వచ్చింది. ఇప్పుడు మొదటి రెండు రాష్ట్రాల్లో సమీప భవిష్యత్తులో పార్టీ తిరిగి పునర్ వైభవం పొందే పరిస్థితి ఎంతమాత్రం కనపడటం లేదు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలే బహిరంగంగా అంగీకరిస్తున్నారు. కేరళలో మాత్రం అయిదేళ్లకోసారి పార్టీ గెలుపు ఓటములతో ముందుకు సాగుతోంది. 1977 తరవాత అధికార పార్టీ రెండోసారి గెలిచిన దాఖలాలు లేవు. అయితే ఈసారి ఆ సంప్రదాయాన్ని తిరిగి రాస్తామన్న ధీమా సీపీఎం వర్గాల్లో కనపడుతోంది. మే 2న ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయన్న విషయాన్ని ఘంటాపథంగా చెబుతోంది.ఇందుకు కారణం ముఖ్యమంత్రి పినరయి విజయన్ అని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. గతంలో పార్టీ వ్యవస్థాపకుడు, తొలి కమ్యూనిస్టుగా సీఎంగా పేరుగాంచిన ఈఎంఎస్ నంబూద్రిపాద్, తరవాత అధికార పగ్గాలు అందుకున్న అచ్యుత మీనన్, పీకే వాసుదేవ నాయర్, ఈకే నయనార్ వంటి దిగ్గజనేతలు సైతం రెండోసారి అధికారం సాధించడంలో విజయవంతం కాలేకపోయారు.అన్ని పార్టీల మాదిరిగా సీపీఎంకు కూడా దిల్లీలో కేంద్ర నాయకత్వం ఉన్నప్పటికీ కేరళ ఎన్నికల్లో దాని పాత్ర నామమాత్రమే. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దక్షిణాదికి చెందిన ఏపీ నాయకుడు. మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ కేరళీయుడే. అయినప్పటికీ ఈ ఇద్దరు అగ్రనేతల పాత్రకేరళ ఎన్నికల్లో పెద్దగా కనపడలేదు.ఏవో కొన్ని ప్రాంతాల్లో ప్రచారం చేయడం తప్ప వారి పాత్ర లేదనే చెప్పాలి. వాస్తవానికి వారు ప్రజాదరణ కలిగిన నేతలు కూడా కారు. అందువల్ల క్షేత్రస్థాయిలో వారి ప్రభావం నామమాత్రమే. ఈ నేపథ్యంలో ఎన్నికలు పూర్తిగా పినరయి విజయన్ చుట్టూనే తిరిగాయి. భారమంతా ఆయనపైనే పడింది. అభ్యర్థుల ఎంపిక మొదలు ప్రచారం వరకూ అన్నీఆయనే చూడాల్సి వచ్చింది. అయినప్పటికీ ఏడు పదుల వయసులోనూ ఆయన విసుగు, విరామం లేకుండా, నిర్విరామంగా పనిచేస్తూ పార్టీని ముందుకు నడిపారు. ప్రత్యర్థుల విమర్శలను, ఆరోపణలను బలంగా తిప్పికొట్టారు. శబరిమలలో మహిళల ప్రవేశం అంశం పార్టీకి ప్రతిబంధకంగా మారకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నారు.అయిదేళ్ల పాలన కాలంలో అనేక కఠిన పరీక్షలు ఎదుర్కొన్న పినరయి విజయన్ వాటిని విజయవంతంగా అధిగమించారు. రెండేళ్ల క్రితం రాష్ట్రాన్ని వరదలు కుదిపేశాయి. తొలి కరోనా పాజిటివ్ కేసు వెలుగు చూసింది ఇక్కడే. ఇప్పటికీ కరోనాతో రాష్ట్రం సతమతమవుతోంది. తన పాలన సామర్థ్యంతో ఆయన ఈ సమస్యలను పినరయి విజయన్ ఎదుర్కొన్నారు. లాక్ డౌన్ సమయంలో ఇంటింటికీ ఆహార, నిత్యావసర ప్యాకెట్లను సరఫరా చేసి ప్రజల మన్ననలు పొందారు. లక్షలాది మంది పేదలకు అండగా నిలిచారు. ప్రతి బడ్జెట్లో పింఛన్ల మొత్తం పెంచుతూ వచ్చారు. నిస్సాన్, టెక్ మహీంద్ర వంటి కంపెనీలు ఐటీ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. ఇవన్నీ ఆయనకు ప్రజాదరణను పెంచాయి.కొన్ని ప్రతికూలాంశాలు కూడా లేకపోలేదు. బంగారం అక్రమ రవాణా కుంభకోణం ప్రభుత్వాన్ని కుదిపేసింది. ఈ కుంభకోణంలో పలువురు ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను ప్రజలు పెద్దగా విశ్వసించినట్లు కనపడ లేదు. అందువల్లే ప్రచారంలో పినరయి విజయన్ కు ఎక్కడా వ్యతిరేకత ఎదురుకాలేదు. ఇక విపక్ష కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీల తరఫున రాహుల్ గాంధీ, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ల ప్రచారం, ఆరోపణలు ప్రజలు విశ్వసించిన పరిస్థితి లేదు. అందువల్ల విజయంపై పినరయి విజయన్, , పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

# వాహనదారులకు అదిరిపోయే శుభవార్త!

న్యూఢిల్లీ: మీకు దగ్గర ఏదైనా వాహనం ఉందా? లేదా కొత్త వాహనాన్ని కొనుగోలు చేయాలని అనుకుంటున్నారా? అయితే, మీకు శుభవార్త. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటారు వాహన 1989 చట్టంలోని కొన్ని నిబంధనలలో మార్పులు చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. వాహన యజమాని వాహనాల రిజి(స్ట్రేషన్ సమయంలో తన వాహనానికి నామినీ పేరును కూడా జత చేయవచ్చు. ప్రస్తుతం ఎలాగైతే బ్యాంక్ ఖాతా, భీమా వంటి ఖాతాలకు నామినీని పెట్టుకున్నామో అలాగా అన్నమాట. వాహన యజమాని మరణించినప్పుడు ఆ వాహనాన్ని తన పేరు మీద మార్చుకోవడానికి ఈ మార్పుల వల్ల సులభతరం కానుంది. నామినీ పేరును వాహనాల రిజి(స్ట్రేషన్ సమయంలో లేదా తర్వాత అయిన ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా జత చేయవచ్చు. ఇప్పటి వరకు నామినీని జాతచేయడంలో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలులో ఉండే విదంగా కొత్త నిబందనలు తీసుకువచ్చింది. నామినీ పేరును జత చేయాలంటే అతని గుర్తింపు కార్డు తప్పనిసరిగా సమర్పించాలి.హాహన యజమాని మరణించిన తర్వాత ఆ వాహనాన్ని తన పేరుమీదకు మార్చాలంటే 30 రోజుల్లోపు యజమాని మరణాన్ని రిజి(స్ట్రేషన్ అథారిటీకి తెలపాల్సి ఉంటుంది. అలాగే, వాహన యజమాని మరణించిన 3 నెలల్లో నామినీ వాహన బదిలీ కోసం ఫారం-31 ను సమర్పించాలి. పెళ్లి విడాకులు, ఆస్తి విభజన వంటి సందర్భాల్లో నామినీలో పేరు మార్పు కోసం యజమాని అంగీకరించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ)తో మార్చవచ్చు.ప్రస్తుతం ఒక వాహనం రిజిస్టర్డ్ యజమాని మరణించిన సందర్భంలో వాహనాన్ని నామినీకి బదిలీ చేయడానికి వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాలి. రాష్ట్రం రా(ష్టానికీ ఈ విధానం మారుతూ ఉంటుంది. యజమాని మరణించిన సందర్భంలో వాహన బదిలీకి చట్టపరమైన వారసుడిగా గుర్తింపు రుజువు చూపించాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పౌరుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు నవంబర్ 27న, 2020 రిజి(స్ట్రేషన్ సర్టిఫికెట్ లో నామినీ పేరు వాహనం యజమాని జత చేయడానికి సెంట్రల్ మోటార్ వాహనాలు 1989 చట్టంలో మార్పులు చేయాలని మొదట ప్రతిపాదించింది. తర్వాత అన్ని మంత్రిత్వ శాఖల నుంచి అలాగే, సాధారణ ప్రజల నుండి సలహాలు కోరింది. అన్నీ సూచనలను పరిశీలించిన తరువాత, మంత్రిత్వ శాఖ తుది నోటిఫికేషన్ విడుదల చేసింది.

# కీరదోసకాయ తింటే డయాబెటిస్ నివారించవచ్చు? ఎలాగో ఇక్కడ తెలుసుకోండి..



డయాబెటిస్ తీవ్రమైన జీవక్రియ వ్యాధి మరియు దాని రేటు ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతోంది. అధిక కేలరీల ఆహార పదార్థాల వినియోగం, నిశ్చల జీవనశైలి మరియు బరువు పెరగడం మధుమేహం యొక్క సాధారణ ప్రమాద కారకాలు. జీవనశైలి మరియు ఆహారంలో మార్పు వ్యాధి మరియు దాని సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది, ఒక వ్యక్తి నాణ్యమైన జీవితంతో ఎక్కువ కాలం జీవించేలా చేస్తుంది.గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడానికి మరియు హైపర్లిపిడెమియాను మెరుగుపరచడానికి క్రియాశీల సమ్మేళనాలు పండ్లు, మూలికలు మరియు కూరగాయలు వంటి అనేక క్రియాత్మక ఆహారాలలో కనిపిస్తాయి. అవి మార్కెట్లో సులభంగా లభిస్తాయి మరియు ఖర్చుతో కూడుకున్నవి.దోసకాయ, విస్తృతంగా వినియోగించే కూరగాయ, డయాబెటిస్ నియంత్రణ ఆహారాలలో ఒకటి, ఇది కుకుర్బిటేసి కుటుంబానికి చెందినది. ఇది ప్రత్యేకమైన చేదు రుచిని కలిగి ఉంది మరియు సాంప్రదాయ ఔషధం మరియు జానపద ఔషధాలలో శతాబ్దాలుగా ఉపయోగిస్తారు. దోసకాయ మధుమేహానికి ప్రధాన కారణాలైన మంట మరియు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.ఈ వ్యాసంలో, దోసకాయ మరియు మధుమేహం మధ్య సంబంధం గురించి చర్చిస్తాము. ఒకసారి చూడండి.దోసకాయ శోథ నిరోధక ఆస్తిమనకు తెలిసినట్లుగా, డయాబెటిస్ దీర్ఘకాలిక శోథ వ్యాధి (లాంగర్‌హాన్స్ యొక్క ప్యాంక్రియాటిక్ ద్వీపాల యొక్క వాపు), అందువల్ల, దోసకాయ వినియోగం దాని శోథ నిరోధక లక్షణాల కారణంగా మధుమేహం నివారణ మరియు నిర్వహణకు సమర్థవంతమైన ఔషధంగా ఉంటుంది.ఒక అధ్యయనం ప్రకారం, అధిక స్థాయిలో గ్లూకోజ్ శోథ సైటోకిన్లు మరియు ఉచిత కొవ్వు ఆమ్లాల స్థాయిని పెంచుతుంది, ఇవి శరీరంలో ఇన్సులిన్ నిరోధకతను ప్రేరేపిస్తాయి.దోసకాయ హైపర్లిపిడెమియా మరియు మంటను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు ఊబకాయం ఉన్నవారిలో ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తుంది, దీనివల్ల విసెరల్ కొవ్వులు ఒకేసారి తగ్గుతాయి, ఇవి బరువు నిర్వహణకు సహాయపడతాయి మరియు తద్వారా డయాబెటిస్ నిర్వహణకు సహాయపడతాయి.దోసకాయ యొక్క యాంటీ-ఆక్సీకరణ ఆస్తిఆక్సిజన్ మరియు కార్బొనిల్ జాతుల అధిక ఫ్రీ రాడికల్స్ యొక్క తరం శరీరంలో యాంటీఆక్సిడెంట్ రక్షణ వ్యవస్థల క్షీణతకు దోహదం చేస్తుంది, ఇది మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల పురోగతికి కారణం కావచ్చు.రియాక్టివ్ ఆక్సిజన్ మరియు కార్బొనిల్ రాడికల్స్ ఉండటం వల్ల కణాలు మరియు కణజాలాలకు ఆక్సీకరణ కోసం వాటి ఎలక్ట్రాన్లను దొంగిలించడం ద్వారా కణాలు మరణానికి దారితీస్తాయి.సహజ యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి మరియు కార్బొనిల్ ఒత్తిడిని తగ్గించవచ్చు, మధుమేహం రావడానికి మరియు దానికి సంబంధించిన సమస్యలకు కొన్ని ప్రధాన కారణాలు.ఒక అధ్యయనంలో, దోసకాయ సహజ సమ్మేళనాల యొక్క రక్షిత ప్రభావాలు ఆక్సీకరణ మరియు కార్బొనిల్ ఒత్తిడి నమూనాలకు వ్యతిరేకంగా కనుగొనబడ్డాయి, ఇవి సైటోటాక్సిసిటీని ప్రేరేపిస్తాయి.దోసకాయ దాని యాంటీఆక్సిడెంట్ చర్య కారణంగా ఆక్సీకరణ మరియు కార్బొనిల్ ఒత్తిడి రెండింటికీ సైటోటాక్సిసిటీ గుర్తులను ఏర్పరచడాన్ని నిరోధిస్తుంది మరియు శరీరంలో ఫ్రీ రాడికల్స్ తగ్గించడానికి సహాయపడుతుంది. అలాగే, దోసకాయ యొక్క యాంటీ-హైపర్గ్లైసీమిక్ ప్రభావం గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి మరియు మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.డయాబెటిస్‌పై దోసకాయ పై తొక్క ప్రభావంపైలట్ అధ్యయనంలో, దోసకాయ పై తొక్క యొక్క సామర్థ్యం అధిక గ్లూకోజ్ స్థాయికి వ్యతిరేకంగా కనుగొనబడింది. దోసకాయ తొక్కతో పాటు 11 మరియు 12 వ రోజులలో అలోక్సాన్ (క్లోమంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలను నాశనం చేసే రసాయన సమ్మేళనం) పరిపాలన తరువాత వరుసగా 10 రోజులు దోసకాయ పై తొక్క ఇవ్వబడింది.ఫలితంగా, దోసకాయ పై తొక్క అలోక్సాన్ వల్ల కలిగే నష్టాన్ని దాదాపుగా తిప్పికొట్టిందని, టైప్ 1 డయాబెటిస్‌కు వ్యతిరేకంగా పై తొక్క ప్రభావవంతంగా ఉంటుందని సూచిస్తుంది,అలాగే, ఆస్కార్బిక్ ఆమ్లం, పాలీఫెనాల్స్ మరియు ఫ్లేవనాయిడ్ల యొక్క కంటెంట్ దోసకాయ తొక్కలలో కనుగొనబడింది, ఇవి ఈ ముఖ్యమైన వెజ్జీ యొక్క డయాబెటిక్ వ్యతిరేక ప్రభావం గురించి స్పష్టంగా చెబుతాయి.

# ‘ఇకపై వార్నర్‌ను సన్‌రైజర్స్ జెర్సీలో చూడలేం

న్యూఢిల్లీ: “యాజమాన్య నిర్ణయాన్ని డేవిడ్ ప్రశ్నించాడో లేదో నాకు తెలియదు. అయితే, మనీష్ పాండే విషయంలో మాత్రం తాను ఎలాంటి డెసిషన్ తీసుకోలేదని చెప్పాడు. కొన్నిసార్లు మేనేజ్‌మెంట్‌కు ఇలాంటి మాటలు రుచించకపోవచ్చు. ఒక కెప్టెన్‌గా కొన్ని తప్పనిసరి బాధ్యతలు ఉంటాయి. ఎవరు తుదిజట్టులో ఉంటారు, ఎవరిని పక్కన పెట్టాలి అన్న అంశాలపై స్పష్టత ఉండాలి. అయితే, ఒక్కోసారి పరిస్థితులు మన ఆధీనంలో ఉండవు. మొత్తానికి తెరవెనుక ఏదో జరుగుతోందివవ అంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ బౌలర్ డెయిల్ స్టెయిన్ సందేహం వ్యక్తం చేశాడు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం వ్యవహారశైలి చూస్తుంటే డేవిడ్ వార్నర్ ఇక ఆ జట్టుకు ఆడే పరిస్థితి కనబడటం లేదని పేర్కొన్నాడు.కాగా ఐపీఎల్‌లో మంచి రికార్డు ఉన్న డేవిడ్ వార్నర్‌ను తొలుత కెప్టెన్సీ నుంచి తొలగించిన సన్‌రైజర్స్, సోమవారం నాటి మ్యాచ్‌లో అతడికి తుది జట్టులో కూడా చోటు ఇవ్వలేదు. దీంతో, వార్నర్ అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. జట్టుకు తొలి టైటిల్ అందించిన కెప్టెన్‌ను ఇంతలా అవమానించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. క్రీడా వర్గాల్లోనూ ఈ విషయంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో డెయిల్ స్టెయిన్ మాట్లాడుతూ ఈ మేరకు తన అభిప్రాయాలు పంచుకున్నాడు.2013-15 సీజన్లలో హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించిన అతడు.. కాగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. 55 పరుగుల తేడాతో ఓటమి చెంది ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో వార్నర్‌ను కాదని నబీని జట్టులోకి తీసుకున్నందుకు తగిన మూల్యం చెల్లించుకున్నారంటూ మరోసారి ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు.

# కంచె బ్యూటీకి ఈసారైనా అఖండ విజయం దక్కేనా..?



నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ ‘‘అఖండ’’. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కుర్రాభామ ప్రగ్యా జైస్వాల్ ఒక హీరోయిన్ గా నటిస్తోంది. షూటింగ్ చివరి దశలో ఉన్న ‘అఖండ’ తాజా షెడ్యూల్ కు ప్యాకప్ చెప్పానని ప్రగ్యా ఇన్ స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఈ షూటింగ్ లో బాలకృష్ణ - ప్రగ్యా మధ్య కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు సమాచారం.’డేగ’ అనే సినిమాతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ప్రగ్యా జైస్వాల్.. ‘కంచె’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయినప్పటికీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదనే చెప్పాలి. అందాలు ఆరబోసినా కూడా ఎందుకో కానీ ఈ భామకు అదృష్టం మాత్రం కలిసి రాలేదు. ఈ క్రమంలో ‘జయ జానకి నాయక’ సినిమాలో సెకండ్ హీరోయిన్ ఛాన్స్ ఇచ్చిన దర్శకుడు బోయపాటి.. ఇప్పుడు ‘అఖండ’ సినిమాలో బాలయ్య సరసన నటించే అవకాశం ఇచ్చాడు. ఈ సినిమా సక్సెస్ పై ప్రగ్యా ఎన్నో ఆశలు పెట్టుకుందని తెలుస్తోంది.కాగా ‘అఖండ’ సినిమాలో సీనియర్ హీరో శ్రీకాంత్ విలన్ గా నటిస్తున్నాడు. హీరోయిన్ పూర్ణ కీలక పాత్ర పోషిస్తోంది. థమన్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నాడు. మే 28న ఈ సినిమాని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ.. కరోనా నేపథ్యంలో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇక ఇటీవలే విడుదలైన ‘అఖండ’ టీజర్ టాలీవుడ్ రికార్డులని తిరగరాసింది. యూట్యూబ్ లో తక్కువ సమయంలో 50 మిలియన్ల వ్యూస్ దక్కించుకున్న టీజర్ గా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.

# భానుప్రియను అడగడం లేదా?



తెలుగు తెరను ఒక దశలో ప్రభావితం చేసిన కథానాయికల జాబితాలో విజయశాంతి .. రాధ .. సుహాసిని .. భానుప్రియ కనిపిస్తారు. సుహాసిని సున్నితమైన కథానాయికగా అనిపించుకుంటే. హీరోలతో సమానంగా డాన్సులు వేయడంలో విజయశాంతి .. రాధ .. భానుప్రియ ఫుల్ మార్కులు కొట్టేశారు. ఇక ఈ ముగ్గురిలో క్లాసికల్ డాన్స్ చేయాలంటే మాత్రం భానుప్రియనే. ఆ తరహా పాత్రలు భానుప్రియ చేయవలసిందే .. ఆమెకి ప్రత్యామ్నాయమే లేదు. ‘స్వర్ణకమలం’ వంటి సినిమా చేయాలంటే భానుప్రియవంటి ఆర్టిస్ట్ కావల్సిందే కదా.టాలీవుడ్ లో ఆనాటి అగ్రహీరోలందరి సరసన భానుప్రియ ఆడిపాడారు. విశాలమైన కళ్లతోనే ఆమె నవరసాలను కుమ్మరించేవారు. కళు అంటే భానుప్రియవే అన్ని అప్పట్లో చెప్పుకునేవారు. అంత చక్కని కళ్లున్న హీరోయిన్ ఇంతవరకూ తెలుగు తెరకి మళ్లీ తారసపడలేదంటే అతిశయోక్తి కాదేమో. హీరోయిన్ గా ఒక దశాబ్దం పాటు తెరను ఏలేసిన ఆమె ఆ తరువాత నుంచి ముఖ్యమైన పాత్రలను పోషించడం మొదలుపెట్టారు. అలా భానుప్రియ చేసిన ‘పెదరాయుడు’ .. ‘అన్నమయ్య’.. ‘లాహిరి లాహిరి లాహిరిలో’ సినిమాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆ తరువాత నుంచి హీరోలకు తల్లి పాత్రల్లోను భానుప్రియ మెప్పించారు. అలా ‘ఛత్రపతి’ సినిమాలో ఆమె పోషించిన పార్వతి పాత్రను ప్రేక్షకులు ఇంతవరకూ మరిచిపోలేదు. ఆ మధ్య వచ్చిన ‘మహానటి’లో ‘దుర్గమాంబ’ పాత్రలో తప్ప ఆ తరువాత తెరపై ఆమె మళ్లీ కనిపించలేదు. ‘నాట్యం’ సినిమాకి సంబంధిచి భానుప్రియ పేరు వినిపించిందంతే. ఇతర పాత్రల కోసం భానుప్రియను అడగడం లేదా? లేదంటే చేయడానికి ఆమె ఆసక్తిని చూపడం లేదా? అనేది అభిమానులకు అర్థం కావడం లేదు. తమ అభిమాన నటిని తెరపై చూడాలనే వాళ్లంతా కోరుకుంటున్నారు.

# నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో హాట్ బ్యూటీ..?



100’ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది హాట్ బ్యూటీ పాయల్ రాజ్ పుత్. ఇందులో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి తన అందాలతో యువ హృదయాలను కొల్లగొట్టింది. ఈ క్రమంలో అమ్మడు క్రేజీ ఆఫర్స్ తో స్టార్ స్టేటస్ అందుకుంటుంది అనుకుంటే.. పెద్దగా ప్రాధాన్యం లేని అవకాశాలే తలుపుతట్టాయి. ‘ఖీఆచీ 100’ ‘వెంకీ మామ’ ‘డిస్కోరాజా’ వంటి సినిమాలలో నటించినా ఆమె కెరీర్ కు హెల్ప్ అవలేదు. దీంతో ఐటెమ్ సాంగ్స్ చేయడానికి కూడా రెడీ అయింది. ఇక ‘అనగనగా ఓ అతిథి’ అనే వెబ్ మూవీలో నటించి డిజిటల్ వరల్డ్ లో అడుగుపెట్టింది. అయితే పాయల్ రాజ్ పుత్ కు ఇప్పుడు అన్నీ నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ మాత్రమే వస్తున్నాయని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలుగు డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్ ఆహా రూపొందిస్తున్న ‘త్రీ రోజెస్’ వెబ్ సిరీస్ లో పాయల్ అవకాశం దక్కించుకున్న సమాచారం. ఇటీవలే ఈ వెబ్ సిరీస్ షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో ఆమెది ఓ సీరియస్ పాత్ర అని అంటున్నారు. మొత్తం మీద తనకు కలిసొచ్చిన నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రనే ఈ బ్యూటీ చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మరి అమ్మడు సినిమాలలో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. వెబ్ సిరీస్ లలో సత్తా చాటుతుందేమో చూడాలి. ఇకపోతే పాయల్ తమిళ్ లో ఉదయనిధి స్టాలిన్ సరసన ‘ఏంజెల్’ అనే హారర్ థ్రిల్లర్ లో నటిస్తోందని సమాచారం.

# బార్బీ డాళ్ నిధి కల్లోలం



నవతరం భామల్లో నిధి అగర్వాల్ అందచందాల గురించి ప్రత్యేకించి చెప్పాల్సినదేమీ లేదు. టైగర్ ష్రాఫ్ మున్నా మైఖేల్ చిత్రంతో బాలీవుడ్ లో ఆరంగేట్రం చేసిన ఈ బెంగళూరు బ్యూటీ.. ఆ తర్వాత టాలీవుడ్ లో అక్కినేని హీరోలతో తెరంగేట్రం చేసింది. నాగచైతన్య- అఖిల్ సరసన కథానాయికగా నటించింది. కానీ ఆశించిన విజయం దక్కలేదు. ఆ తర్వాత రామ్ సరసన ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకుంది.ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ - క్రిష్ కాంబినేషన్ మూవీ ‘హరిహర వీరమల్లు‘లో నిధి ఓ కీలక పాత్రలో నటిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాల్లోనూ నిధి వరుస ఫోటోషూట్లు అభిమానుల్లో ట్రెండింగ్ గా మారాయి. తాజాగా నిధి బార్బీ డాళ్ లుక్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది.లైట్ పింక్ మిడ్డీ.. వంగపువ్వు రంగు టాప్ తో నిధి కిల్లర్ లుక్ దుమారం రేపుతోంది. పింక్ బ్యాక్ గ్రౌండ్ కి నియరెస్ట్ మ్యాచింగ్ డిజైనర్ లుక్ లో నిధి అందచందాలు పదింతలు ఎలివేట్ ఆయ్యాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు ఫ్యాన్స్ సోషల్ మీడియాల్లో వైరల్ గా మారుతున్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190